RNI. No: TELTEL/2023/88215

# తెలంగాణ దిశ

TELANGANA DISHA TELUGU DAILY

తెలుగు దినపత్రిక

మల్కాజిగిరి MALKAJGIRI | సంపుటి : 3 VOLUME : 3 | సంచిక : 208 ISSUE NO : 208 | ఎడిటర్ : మెరుగు చంద్రమోహన్ EDITOR : MERUGU CHANDRAMOHAN | బుధవారం, ఫిబ్రవరి, 11, 2026 Wednesday, February,11, 2026 | పేజీలు : 8 వెల : రూ.4/- PAGES : 8 RS : 4 /-



ఇప్పుడ కెనడా వంతు

## వచ్చింది

### ఇరుదేశాల మధ్య వంతెనపై ట్రంప్ పేచీ

**వాషింగ్టన్,ఫిబ్రవరి10 :** కెనడాపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విరుచుకుపడ్డారు. ఇప్పటివరకు అమెరికా నుంచి పొందిన అన్ని ప్రయోజనాలకు ప్రతిఫలంగా తిరిగి తమకు మూల్యం చెల్లించాలని.. లేదంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తమ నుంచి పొందిన వాటికి పూర్తి పరిహారం చెల్లించేవరకు కెనడాలోని ఒంటారియో ప్రావిన్స్ ను అమెరికాలోని మిచిగాన్‌తో కలిపే గోర్డీ హోవే అంతర్జాతీయ వంతెన ను బ్లాక్ చేస్తామని బెదిరించారు.




ఎన్నికలంటే..

## డబ్బునోళ్ల దందా !


**హైదరాబాద్,తెలంగాణ దిశ :**ఎన్నికల్లో ప్రలోభాల పర్వంతో తెలంగాణ పల్లెల నుంచి పట్టణాల దాకా మత్తులో జోగుతున్నాయి. మొన్నటి కి మొన్న పంచాయితీ పోరు ముగిసింది. ఇప్పుడు పట్టణపోరు జరుగుతోంది. డబ్బున్న అభ్యర్థులదే హవా. డబ్బులు లేని అభ్యర్థులను ప్రజలు చూసీచూడనట్లుగా ఉంటున్నారు. అతను ఎందుకు ఖర్చు పెడుతున్నాడో అర్థం చేసుకోవడం లేదు. ఎందుకు ప్రలోభ పెడుతున్నాడో గ్రహించడం లేదు. ఇప్పుడు పెట్టిన డబ్బు రేపు ప్రతి చిన్న పనికీ ముక్కుపిండి వసూలు చేస్తాడని గుర్తించడం లేదు. ఎన్నికలు వచ్చాయంటే రాజకీయ నాయకులకన్నా ప్రజలకు ఎక్కువ సంతోషంగా ఉంది.



వేములవాడ శివరాత్రి ఉత్సవాలకు

## సీఎంకు ఆహ్వానం

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని వేములవాడ శ్రీ రాజరా జేశ్వర స్వామివారి మహా శివరాత్రి జాతర మహో త్సవానికి ఆహ్వానించారు. మంత్రి కొండా సురేఖ, దేవాదాయ శాఖ కమిష నర్ హరీష్, ఆలయ ఈవో రమాదేవి, ఆలయ అర్చకు లు. కలసి ఆహ్వాన పత్రిక అందచేశారు. అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి 'కీసరగుట్ట మహా శివరాత్రి బ్రహ్మోత్స వాలు-2026' ఆహ్వానం అందజేసారు. ఈ రెండు ప్రాంతాల్లో శివ రాత్రి ఉ త్సవాలు విశేషంగా జరుగుతాయి. అందువల్ల వీటికి హాజరు కావాలని మంత్రి కొండా సురేఖ, దేవాదాయ శాఖ కమిషనర్ హరీష్ కోరారు.




తెలంగాణలో నేడు మున్సిపల్

## ఎన్నికలు

- 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లలో పోలింగ్
- భారీగా ఏర్పాట్లు చేసిన రాష్ట్ర ఎన్నికల సంఘం
- అవాంఛనీయ ఘటనలు జరక్కుండా పోలీసుల భద్రత
- మక్తల్ ఆరోవార్డు బిజెపి అభ్యర్థి ఆత్మహత్యతో ఎన్నిక వాయిదా

**హైదరాబాద్,తెలంగాణ దిశ :**తెలంగాణ రాష్ట్రంలో బుధవారం మున్సిపల్ ఎన్నికలు జరుగనున్నాయి. ఈ మేరకు రాష్ట్రఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. అయితే...నారాయణపేట్ జిల్లా మక్తల్ మున్సిపాలిటీలో ఆరోవార్డుఎన్నికను రాష్ట్ర ఎన్నికల సంఘం వాయిదా వేసింది. బీజేపీ అభ్యర్థి ఎరుకలి మహదేవ్ ఆత్మహత్యతో ఎన్నికను రద్దు చేస్తున్నట్టు తెలిపింది. ఎన్నికలకుఒక్క రోజు ముందే అభ్యర్థి ఆత్మహత్య చేసుకోవడం కలకలం రేపుతోంది. ఘటనా స్థలానికి వచ్చిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇకపోతే ఎన్నికల సిబ్బంది తమ సరంజామాతో తమకు కేటాయించిన బూతలకు చేరుకున్నారు. రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్ల పరిధిలో బుధవారం పోలింగ్ జరుగనున్నది.ఉదయం 7 గంటల నుంచే పోలింగ్ పక్రియ ప్రారంభంకా నున్నది. సాయంత్రం 5 వరకు పోలింగ్జరగనుంది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే అన్ని ఏర్పాట్లను పూర్తిచేసింది. ఈ నెల 13న ఓట్ల లెక్కింపుతో ఫలితాలు వెల్లడికానున్నాయి.. ఆ రోజే నగర, పట్టణ ప్రజానీకం ఎవరి వైపు మొగ్గు చూపిందనే ఉతంతకు తెరపడనున్నది. జిల్లాలవారీగా ఏర్పాటు చేసిన పంపిణీ కేంద్రాల నుంచి బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామగ్రిని ఆయా పోలింగ్ కేంద్రాలకు మంగళవారం తరలించారు. ఎన్నికల సిబ్బంది ఇప్పటికే తమకు కేటాయించిన కేంద్రాలకు వాహనాల్లో వెళ్లారు. ఎన్నికలు జరిగే పురపా లికల్లో పోలీసులు గట్టి భద్రత ఏర్పాటు చేశారు. అలాగే సమస్యాత్మక ప్రాంతాల్లో అవాంఛనీయ ఘటనలు జరుగకుండా భారీ భద్రత ఏర్పాటు చేశారు.

గులాబీ పరువు

## నిలిచేనా..?



**హైదరాబాద్,తెలంగాణ దిశ :**అధికారం ఉన్నప్పుడు ఏదైనా చేయవచ్చు. సాధ్యం కానిది కాళ్ల దగ్గరికి తెచ్చుకోవచ్చు. 2020 పురపాలక ఎన్నికల్లో గులాబీ పార్టీ ఇలానే చేసింది. అధికారాన్ని ఉపయోగించింది. అంగబలాన్ని ప్రయోగించింది. అర్థాన్ని వాడింది. తద్వారా తిరుగులేని శక్తిగా ఆవిర్భవించింది.2020లో జనవరి నెలలో పురపాలక ఎన్నికలు జరిగాయి. నాటి ఎన్నికల్లో 120 మున్సిపాలిటీలు.. 9 కార్పొరేషన్లకు ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించింది. నాటి ఎన్నికలలో గులాబీ పార్టీ సత్తా చూపించింది. 120 మున్సిపాలిటీలలో ఏకంగా 110 కంటే ఎక్కువ మునిసిపాలిటీలను తన ఖాతాలో వేసుకుంది. 9కి9 కార్పొరేషన్లను గులాబీమయం చేసింది. మొత్తం 2727 వార్డులలో దాదాపు 70 శాతానికి దగ్గరగా స్థానాలను గులాబీ పార్టీ గెలుచుకుంది. కాంగ్రెస్ పార్టీ 500 వార్డులలో సత్తా చూపిస్తే.. బిజెపి 200 వార్డులలో తన సామర్థ్యాన్ని ప్రదర్శించింది.2020 పురపాలక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యంత దయనీయమైన స్థితిలో ఉండేది. చాలా ప్రాంతాలలో రెండవ స్థానంలో నిలిచినప్పటికీ మునిసిపల్ పీఠాలను అందుకోలేకపోయింది. నాడు హుజుర్ నగర్ నియోజకవర్గంలో ఉప ఎన్నికలో గులాబీ పార్టీ విజయం సాధించిన తర్వాత.. పురపాలక ఎన్నికలు వచ్చాయి. దీంతో గులాబీ పార్టీ సహజంగానే జోష్ మీద పాల్గొంది.



మహదేవప్ప మృతికి

## రేవంత్‌దే బాధ్యత

- ఎన్నికల సంఘం విచారణ జరపాలి
- రేవంత్ రెండేళ్లుగా ఏమీ చేయకుండా తనపై విమర్శలా
- మండిపడ్డ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి10 :** మక్తల్ బీజేపీ అభ్యర్థి మహదేవప్ప మృతికి సీఎం రేవంత్ బాధ్యత వహించాలని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. ఎన్నికల సంఘం విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కిషన్ రెడ్డి కోరారు. అతను అర్థాంతరంగా ఎందుకు ఆత్మహత్య చేసుకున్నాడన్న దానిపై అనుమానాలు ఉన్నాయని అన్నారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. మంగళవారం మీడియాతో మాట్లాడుతూ.. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయమని కిషన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. తలాతోకా లేకుండా రేవంత్ మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ముఖ్యమంత్రి స్థానంలో ఉంటూ రెండేళ్లుగా మాటలతో కాలయాపన చేశారని.. ఏం చేస్తారో చేతల్లో చూపించాలన్నారు. ఇచ్చిన మాటపై నిలబడే శక్తి లేకపోతే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఇకపోతే తన పేరును మార్చి పిలుస్తున్నారని ఫైర్ అయ్యారు.



కోట్లు కురిపిస్తున్న మేడారం

## హుండీలు

**వరంగల్,తెలంగాణ దిశ :** ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర అయిన మేడారం సమ్మక్క–సారలమ్మ మహాజాతర ఇటీవల పూర్తయిన సంగతి తెలిసిందే. దాదాపు రెండున్నర కోట్ల మంది భక్తులు వచ్చి.. అమ్మవార్లను దర్శించుకున్నట్లు తెలంగాణ ప్రభుత్వం వెల్లడించింది. ఇక మేడారంలో ఏర్పాటు చేసిన హుండీలను హనుమకొండకు తీసుకువచ్చి.. టీటీడీ కల్యాణ మండపంలో గత గురువారం రోజున లెక్కింపు ప్రక్రియను రాష్ట్ర దేవాదాయ శాఖ అధికారులు ప్రారంభించారు. ఇవాళ్టికి గత 5 రోజులుగా హుండీలను లెక్కించే పనిలో దేవాదాయ శాఖ సిబ్బంది తలమునకలై ఉన్నారు. ఇక ఐదోరోజు 163 హుండీ లను లెక్కించిన అధికారులు ఇప్పటివరకు వచ్చిన ఆదాయం వివరాలను వెల్లడించారు. ఒక్కరోజే 163 హుండీల ను లెక్కించగా.. అందులో మొత్తం రూ.1.12 కోట్ల ఆదాయం సమకూరినట్లు తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఇప్పటివరకు గత 5 రోజుల్లో మొత్తం 788 హుండీలను లెక్కించినట్లు దేవాదాయ శాఖ అధికారులు వెల్లడించారు. ఇందులో మొత్తంగా ఇప్పటివరకు రూ.11.83 కోట్ల ఆదాయం వచ్చినట్లు తెలిపారు. ఇందులో మన దేశ కరెన్సీతోపాటు విదేశాలకు చెందిన నోట్లు వస్తున్నాయని పేర్కొన్నారు. ఇప్పటివరకు దాదాపు 18 దేశాలకు చెందిన నోట్లు వచ్చాయని వెల్లడించారు.




తగలబడిందా..

## తగలబెట్టేరా..?

**అగ్నిప్రమాదం రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనం**

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** హైదరాబాద్‌లోని స్టేట్ ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీలో సంభవించిన భారీ అగ్నిప్రమాదం రాష్ట్రవ్యాప్తంగా పెను సంచలనం సృష్టిస్తోంది. ఈ ప్రమా దంలో కీలకమైన కేసులకు సంబం ధించిన ఆధారాలు, డిజిటల్ సాక్ష్యా లు అగ్నికి ఆహుతయినట్లుగా తెలు స్తోంది. సుమారు రెండు గంటల పాటు అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా శ్రమించి మంటలను అదుపులోకి తెచ్చినప్పటికీ, అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. ఉదయం వేళ కార్యాలయం పనుల్లో నిమగ్నమై ఉన్న సమయంలో, అకస్మాత్తుగా కంప్యూటర్ ల్యాబ్ విభాగం నుంచి మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే మంటలు ఇతర విభాగాలకు వ్యాపించాయి. దట్టమైన పొగలు భవనం మొత్తాన్ని కమ్మేశాయి.

# కృత్రిమ మేధస్సు భవిష్యత్‌కు విద్యార్థులకు దారి చూపిన సిఎస్ఐ ఎఐ100కె








**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 10, (తెలంగాణ దిశ)** :కృత్రిమ మేధస్సు (ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్), ఆధునిక సాంకేతికతలు ప్రపంచాన్ని వేగంగా మార్చుతున్న నేపథ్యంలో, విద్యార్థులను భవిష్యత్ సవాళ్లకు సిద్ధం చేయాలనే లక్ష్యంతో బీవీఆర్ఐటి హైదరాబాద్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఫర్ ఉమెన్‌లో కంప్యూటర్ సొసైటీ ఆఫ్ ఇండియా (సిఎస్ఐ), హైదరాబాద్ చాప్టర్ సహకారంతో సిఎస్ఐ ఎఐ100కె అనే ప్రతిష్టాత్మక అవగాహన మరియు శిక్షణా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో ఎఐపై అవగాహన పెంపొందించడమే కాకుండా, పరిశ్రమ అవసరాలకు అనుగుణంగా నైపుణ్యాలను అభివృద్ధి చేసుకునేలా ప్రోత్సహించిన కీలక వేదికగా నిలిచింది. ఈ కార్యక్రమంలో సిఎస్ఐ ఎఐ100కె కన్వీనర్, ఇన్ఫోసిస్ సంస్థలో డేటా అనలిటిక్స్, ఏఐ అండ్ ఎంఎల్ విభాగంలో ప్రధాన కన్సల్టెంట్‌గా పనిచేస్తున్న డాక్టర్ కల్యాణ్ కుమార్ సర్వేపల్లి ముఖ్య వక్తగా పాల్గొని తన విశాలమైన పరిశ్రమ అనుభవాన్ని విద్యార్థులతో పంచుకున్నారు. ఏఐ ప్రాధాన్యత, వాస్తవ ప్రపంచ వినియోగాలు, భవిష్యత్తులో పరిశ్రమలపై ఏఐ ప్రభావం వంటి అంశాలను ఆయన స్పష్టంగా వివరించారు. వనరుల వ్యక్తిగా పాల్గొన్న శ్రీ దాదా బాషా ఏఐ నేర్చుకునే విధానాలు, అవసరమైన నైపుణ్యాలు, ప్రాజెక్ట్ ఆధారిత అభ్యాసం ప్రాముఖ్యతపై విద్యార్థులకు మార్గనిర్దేశం చేశారు. అలాగే సిఎస్ఐ హైదరాబాద్ ఇమిడియేట్ పాస్ట్ చైర్మన్ సి. సుధాకర్ పరిశ్రమ, విద్యా సంస్థల మధ్య సమన్వయం ఎంత అవసరమో వివరిస్తూ, విద్యార్థులు చదువుకునే దశ నుంచే పరిశ్రమకు సిద్ధంగా మారాలని సూచించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కెవిఎన్. సునీత మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థులకు సాంకేతిక జ్ఞానంతో పాటు భవిష్యత్ వృత్తి జీవితానికి అవసరమైన దృక్పథాన్ని అందిస్తాయని పేర్కొన్నారు. పరిశ్రమ నిపుణుల మార్గనిర్దేశం ద్వారా విద్యార్థులు తమ నైపుణ్యాలను మరింత మెరుగు పరుచుకునే అవకాశం లభిస్తుందని ఆమె అభినందించారు. కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగాధిపతి డాక్టర్ అరుణ రావు మాట్లాడుతూ ఏఐ, మెషిన్ లెర్నింగ్ వంటి ఆధునిక రంగాల్లో ముందంజలో నిలవాలంటే ఇలాంటి అవగాహన కార్యక్రమాలు ఎంతో అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమం విద్యార్థుల్లో పరిశోధనాత్మక ఆలోచనలను, నవీనతను పెంపొందించిందని పేర్కొన్నారు. ఈ శిక్షణ కార్యక్రమం ద్వారా విద్యార్థులు ఏఐ మౌలిక అంశాలు, మెషిన్ లెర్నింగ్, జనరేటివ్ ఏఐ, పరిశ్రమల్లో ఏఐ వాస్తవ వినియోగాలు, బాధ్యతాయుత కృత్రిమ మేధస్సు ఆచరణలు, అలాగే వివిధ వృత్తి అవకాశాలపై సమగ్ర అవగాహన పొందారు. విద్యార్థులు, అధ్యాపకులు పెద్ద సంఖ్యలో ఉత్సాహంగా పాల్గొనడం ఈ కార్యక్రమానికి మరింత ప్రత్యేకతను తీసుకొచ్చింది. మొత్తంగా, సిఎస్ఐ ఎఐ100కె కార్యక్రమం విద్యార్థుల విద్యా వృత్తి ప్రయాణంలో ఒక కీలక మైలురాయిగా నిలిచిందని నిర్వాహకులు పేర్కొన్నారు.

# కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో యువతి అదృశ్యం



**కుషాయిగూడ, ఫిబ్రవరి 10, (తెలంగాణ దిశ)** :కుషాయిగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువతి అదృశ్యమైన ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మౌలాలి హెచ్‌బి కాలనీ ఇంద్రా నగర్ నివాసి రేణుక ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆమె కుమార్తె ఎస్. పావని (19) ఈ నెల 9వ తేదీ ఉదయం 8 గంటలకు ఉద్యోగానికి వెళ్లింది. అదే రోజు సాయంత్రం 6 గంటల సమయంలో తల్లికి ఫోన్ చేసి ఆలస్యంగా ఇంటికి వస్తున్నానని తెలిపింది. అనంతరం రాత్రి 8 గంటల సమయంలో మరోసారి ఫోన్ చేసి తాను బస్ స్టాప్‌లో ఉన్నానని, త్వరలో ఇంటికి చేరుకుంటానని చెప్పింది. అయితే ఆ తర్వాత మళ్లీ ఫోన్ చేయగా పావని మొబైల్ స్విచ్ ఆఫ్ రావడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. ఆమెను బంధువులు, స్నేహితులు, అన్ని సంబంధిత ప్రదేశాల్లో వెతికినా ఎక్కడా ఆచూకీ లభించలేదు. దీంతో తల్లి రేణుక కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసుకుని యువతి ఆచూకీ కోసం దర్యాప్తు చేపట్టారు. యువతికి సంబంధించిన ఏలాంటి సమాచారం తెలిసిన వారు సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించాలని పోలీసులు కోరుతున్నారు.

# పేద వ్యాపారుల సమస్యకు కాంగ్రెస్ భరోసా

## - ప్రత్యామ్నాయ స్థల వివాదం పరిష్కారానికి చర్యలు.... కోలన్ హన్మంత్ రెడ్డి



**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 10, (తెలంగాణ దిశ)** :కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ప్రగతి నగర్ డివిజన్ నుంచి కూకట్‌పల్లి వెళ్లే ప్రధాన రహదారి మార్గంలోని చెరువు గట్టు ప్రాంతంలో జీవనోపాధి కోసం చిన్నచిన్న వ్యాపారాలు నిర్వహిస్తున్న పేద వ్యాపారులను ఇటీవల హైడ్రా అధికారులు ఖాళీ చేయించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో అధికారులు చూపించిన ప్రత్యామ్నాయ స్థలంపై కొంత మంది కావాలని వివాదం సృష్టించడంతో, ఇబ్బందులు ఎదుర్కొంటున్న వ్యాపారులు మంగళవారం కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ కోలన్ హన్మంత్ రెడ్డిని ఆశ్రయించారు. వ్యాపారుల సమస్యను సానుకూలంగా స్పందించిన హన్మంత్ రెడ్డి వెంటనే సంబంధిత రెవెన్యూ, మునిసిపల్ అధికారులతో మాట్లాడారు. అవసరమైతే ఈ అంశాన్ని జిల్లా కలెక్టర్, ఆర్డీఓ స్థాయికి తీసుకెళ్లి పూర్తి స్థాయిలో పరిష్కారం సాధిస్తామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పేద కుటుంబాలకు చిన్న వ్యాపారాలే ఏకైక జీవనోపాధి అని, అదే సమయంలో రోడ్డు విస్తరణ, అభివృద్ధి పనులు కూడా అవసరమేనని, కాబట్టి ప్రభుత్వం అభివృద్ధితో పాటు పేదల ఉపాధిని కూడా కాపాడాల్సిన బాధ్యత తీసుకుంటుందని అన్నారు. ఇదే కాంగ్రెస్ పార్టీ విధానమని స్పష్టం చేశారు. ప్రత్యామ్నాయంగా చూపించిన స్థలం పూర్తిగా ప్రభుత్వ భూమి అని, అక్కడ ఉన్న లిటిగేషన్ సమస్యలను తొలగించి రెండు నుంచి మూడు రోజుల్లోనే పేద వ్యాపారులకు శాశ్వతంగా దుకాణాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలేటి శ్రీనివాస్‌తో పాటు పలువురు వ్యాపారులు పాల్గొన్నారు.

# కేబుల్ ఛానళ్లకు మద్దతుగా జేఏసీ ముట్టడి

## - టిడబ్ల్యూజెఎఫ్ (హెచ్ 2843) రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య



**హైదరాబాద్, ఫిబ్రవరి 10, (తెలంగాణ దిశ)** :తెలంగాణ రాష్ట్రంలో కేబుల్ ఛానళ్లపై జరుగుతున్న కక్ష పూరిత, వివక్షపూరిత చర్యలకు నిరసనగా కేబుల్ ఛానల్ జేఏసీ పిలుపు మేరకు హైదరాబాద్ మాసబ్ ట్యాంక్‌లోని ఐ అండ్ పీఆర్ కార్యాలయం వద్ద భారీ ముట్టడి కార్యక్రమం నిర్వహించారు. ఈ నిరసనలో రాష్ట్రంలోని పలు జర్నలిస్టు సంఘాల నాయకులు, కేబుల్ ఛానల్ నిర్వాహకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. నిరసనలో పాల్గొన్న నాయకులు మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో మీడియా స్వేచ్ఛ మూలస్తంభమని పేర్కొన్నారు. కేబుల్ ఛానళ్లపై ఒత్తిళ్లు, పరిమితులు విధించడం ద్వారా ప్రజల గొంతును నొక్కే ప్రయత్నం జరుగుతోందని ఆరోపిస్తూ, తక్షణమే ఇలాంటి చర్యలను నిలిపివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడబ్ల్యూజెఎఫ్ (హెచ్--2843) రాష్ట్ర కన్వీనర్ మామిడి సోమయ్య మాట్లాడుతూ కేబుల్ ఛానళ్లకు సంపూర్ణ మద్దతు ప్రకటించారు. మీడియాపై కక్ష సాధింపు చర్యలు ప్రజాస్వామ్యానికి ముప్పుగా మారతాయని, జర్నలిస్టు సంఘాలు ఎట్టి పరిస్థితుల్లోనూ



మౌనంగా ఉండవని ఆయన స్పష్టం చేశారు. కేబుల్ ఛానళ్లకు న్యాయం జరిగే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని, అవసరమైతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని విస్తరిస్తామని జేఏసీ నేతలు ప్రకటించారు. ఈ ముట్టడి కార్యక్రమం మీడియా హక్కుల పరిరక్షణకు ఒక బలమైన సంకేతంగా నిలిచిందని పాల్గొన్నవారు అభిప్రాయపడ్డారు.

# లా సెట్ ప్రవేశ పరీక్షపై నేడు టి-సాట్ స్పెషల్ లైవ్

## - సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి




T-SAT

**శేరిలింగంపల్లి, ఫిబ్రవరి 10, (తెలంగాణ దిశ)** :మే 18వ తేదిన జరగనున్న తెలంగాణ లా సెట్ పరీక్షకు సిద్ధమయ్యే అభ్యర్థుల కోసం బుధవారం టి-సాట్ ప్రత్యేక అవగాహన లైవ్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. ఉదయం 11 నుండి 12 గంటల వరకు నిపుణ ఛానల్ లో ప్రసారమయ్యే ప్రత్యేక ప్రత్యక్ష ప్రసార కార్యక్రమంలో లా సెట్ తెలంగాణ కన్వీనర్ ప్రొఫెసర్ బి. విజయలక్ష్మి సలహాలు-సూచనలు అందిస్తారన్నారు. లా సెట్ పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తమ తమ సందేహాలను లైవ్ కార్యక్రమం ద్వార పరిష్కరించుకోవచ్చన్నారు. 12వ తేది నుండి ప్రత్యేక ప్రసారాలు మే 18వ తేదిన నిర్వహించబడే లా సెట్ పరీక్ష కోసం తెలంగాణ యువతను సిద్ధం చేసేందుకు 11వ తేదిన లైవ్ కార్యక్రమం అనంతరం ఈ నెల 12వ తేది నుండి ప్రత్యేక డిజిటల్ ప్రసారాలు కొనసాగించనున్నట్లు సీఈవో బోదనపల్లి వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. 12వ తేది ఫిబ్రవరి నుండి మే 12వ తేది వరకు 90 రోజులు పాటు రోజుకు రెండు పాఠ్యాంశ భాగాల చొప్పున 180 ఎపిసోడ్స్ ప్రసారం చేయనున్నామని, ఉదయం ఆరు నుండి ఏడు గంటల వరకు టి-సాట్ విద్య ఛానల్, సాయంత్రం ఆరు నుండి ఏడు గంటల వరకు నిపుణలో పున: ప్రసారం కానున్నాయని సీఈవో వివరించారు. జనరల్ నాలెడ్జ్, మెంటల్ ఎబిలిటి, కరెంట్ అఫైర్స్ అండ్ అప్టిట్యూడ్ ఫర్ ద స్టడీ అఫ్ ద లా సబ్జెక్టులపై ప్రత్యేక ప్రసారాలుంటాయని, టి-సాట్ ప్రసారం చేసే డిజిటల్ పాఠ్యంశాలను తెలంగాణ యువత సద్వినియోగం చేసుకోవాలని సీఈవో వేణుగోపాల్ రెడ్డి సూచించారు.

# నూతన యూజీడీ నిర్మాణానికి అవసరమైన నిధులు కేటాయించాలి

## - మంత్రికి వినతిపత్రం సమర్పించిన కాలనీ సంక్షేమ సంఘం

**కుషాయిగూడ, ఫిబ్రవరి 10, (తెలంగాణ దిశ)**:కుషాయిగూడ ప్రాంతంలో పాత డ్రైనేజ్ వ్యవస్థ కారణంగా ఏర్పడుతున్న సమస్యలను పరిష్కరించేందుకు నూతన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి అవసరమైన నిధులు ఇవ్వాలని కోరుతూ మంత్రి శ్రీధర్ బాబు, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డిలకు కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం వినతి పత్రం సమర్పించారు. స్థానికంగా అనేక వీధుల్లో సుమారు 30 సంవత్సరాల క్రితం ఏర్పాటు చేసిన డ్రైనేజ్ వ్యవస్థ పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో మురుగు నీరు రోడ్లపైకి వచ్చి, వీధులన్నీ అస్తవ్యస్తంగా మారాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితి వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఆరోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో సమస్య ఉన్న వీధుల్లో త్వరితగతిన నూతన అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ వ్యవస్థను నిర్మించాలని కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు సింగిరెడ్డి సోమశేఖర్ రెడ్డి, కార్యదర్శి పనగట్ల చక్రపాణి గౌడ్ ల ఆధ్వర్యంలో మంత్రి, ఎమ్మెల్యేలకు వినతి అంద జేశారు. ఈ కార్యక్రమంలో కుషాయిగూడ పెద్దలు పండాల శివకుమార్ గౌడ్, సప్పిడి శ్రీనివాస్ రెడ్డి, చల్ల ప్రభాకర్, గంప కృష్ణ, యావపురం రవి, వెంకటేశ్వర్లు, కొడకండ్ల యాదయ్య, సల్ల వెంకటేష్, సారా అనిల్ ముదిరాజ్, పండాల గణేష్ గౌడ్, నలచెరువుల జనార్ధన్, దయానంద్, ఆంజనేయులు యాదవ్, పులి నరేందర్, అనిల్ యాదవ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.





# ఘనంగా రేణుక ఎల్లమ్మ దేవి ఆలయ వార్షికోత్సవ జాతర మహోత్సవాలు



**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 10, (తెలంగాణ దిశ)** :కుత్బుల్లాపూర్ నియోజకవర్గం మహాదేవపురం డివిజన్ పరిధిలోని బాలయ్య నగర్‌లోని శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ దేవి ఆలయ 22వ వార్షికోత్సవ జాతర మహోత్సవాలు భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జీ కొలన్ హన్మంత్ రెడ్డి ప్రధాన అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, నియోజకవర్గ ప్రజలు సుఖసంతోషాలతో, ఆరోగ్యం, సమృద్ధితో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఇలాంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో ఐక్యత, శాంతి, సామాజిక సమరసతను పెంపొందిస్తాయని కొలన్ హన్మంత్ రెడ్డి పేర్కొన్నారు. దేవాలయాలు ప్రజలను ఒకే వేదికపైకి తీసుకొచ్చే కేంద్రాలుగా నిలుస్తాయని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు సిద్ధనోళ్ల సంజీవరెడ్డి, బట్టపాల కృష్ణ, మైసిగారి శ్రీనివాస్, హమ్మి రెడ్డి తో పాటు ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎన్నికల సామాగ్రి డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల పరిశీలన





**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 10, (తెలంగాణ దిశ)** :మున్సిపల్ ఎన్నికలలో భాగంగా మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని మూడు చింతలపల్లి, ఆలియాబాద్, ఎల్లంపేట్ మున్సిపాలిటీలలో ఎన్నికలకు ఉపయోగించే సామాగ్రి డిస్ట్రిబ్యూషన్ సెంటర్ల ను సాధారణ ఎన్నికల పరిశీలకులు నిర్మల కాంతి వెస్లే తో కలిసి జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మను చౌదరి పరిశీలించారు. మంగళవారం మూడు మున్సిపాలిటీలలోని డిస్ట్రిబ్యూషన్ సెంటర్లతో పాటు స్ట్రాంగ్ రూమ్స్, కౌంటింగ్ సెంటర్ల ఏర్పాట్లును పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సామాగ్రి, సిబ్బందిని పోలింగ్ బూత్ లకు నిర్ణీత సమయంలో చేరుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికల ప్రక్రియ ప్రశాంతంగా, సజావుగా నిర్వహించాలని ఎన్నికల సిబ్బందిని కోరారు. స్ట్రాంగ్ రూమ్స్, కౌంటింగ్ సెంటర్లకు గట్టి బందోబస్తు ఏర్పాటు చేయాలని, ప్రతి కౌంటింగ్ టెబుల్స్ దగ్గర సిసి కెమెరాలను ఏర్పాటు చేసి నిరంతర పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు.

# మల్కాజిగిరి జిల్లాలో 'మీడియేషన్ ఫర్ నేషన్, మీడియేషన్ డ్రైవ్ 2.0'




**కుషాయిగూడ, ఫిబ్రవరి 10, (తెలంగాణ దిశ)** :సుప్రీంకోర్టు, తెలంగాణ హైకోర్టు ఆదేశాల మేరకు 'మీడియేషన్ ఫర్ నేషన్ -- మీడియేషన్ డ్రైవ్ 2.0' కార్యక్రమాన్ని మల్కాజిగిరి జిల్లాలోని అన్ని న్యాయస్థానాలలో నిర్వహించనున్నట్లు జిల్లా ప్రధాన న్యాయమూర్తి వి. బాల భాస్కర రావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న కేసులను మధ్యవర్తిత్వం (మీడియేషన్) ద్వారా సులభంగా, వేగంగా పరిష్కరించుకునేందుకు ఇది ఒక మంచి అవకాశమని పేర్కొన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, న్యాయస్థానాల భారం తగ్గించడంతో పాటు స్నేహపూర్వకంగా సమస్యలకు పరిష్కారం కనుగొనాలని సూచించారు. ఈ మీడియేషన్ డ్రైవ్‌ను మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు తెలిపారు.

# సంపాదకీయం

## మూసీ పునరుజ్జీవంతో నగరానికి మహర్దశ

ఈ నేపథ్యంలో మూసీ సుందరీకరణపై అధ్యయనం చేశాం. ఏడాదంతా నదిలో నీళ్లు ప్రవహించేలా ప్రణాళికలు రూపొందించాం. మూసీ ప్రక్షాళనకు కన్సల్టెంట్ కోసం గ్లోబల్ టెండర్లు పిలిచాం. 3 సంస్థలు జాయింట్ వెంచర్ కింద మూసీ పునరుద్ధరణ పనులు చేపట్టాయి. గోదావరి నుంచి 20 టీఎంసీల నీరు నగరానికి తరలించాలనే ప్రణాళిక ఉందని, అందులో ప్రజల దాహార్తిని తీర్చేందుకు 15 టీఎంసీలు, గండిపేటకు మరో 5 టీఎంసీలు తరలించేలా ఆలోచిస్తున్నామని వివరించారు. నదీ పరివాహక ప్రాంతాల్లో సుందరీకరణపై లండన్, జపాన్, జర్మనీ, దక్షిణ కొరియా, సింగపూర్‌లలో అధ్యయనం చేశాం. ప్రపంచస్థాయి నగరాల్లో నదీ పరివాహక ప్రాంతాలను కాపాడుకొని వ్యాపార కేంద్రాలుగా మార్చారు. ఆర్థికవ్యవస్థ బలోపేతానికి ఆయా దేశాలు పోటీపడుతున్నాయి. గుజరాత్‌లో సబర్మతి నది అభివృద్ధి కోసం 60వేల కుటుంబాలను తరలించారు. యూపీలో గంగా నదిని ప్రక్షాళన చేసి రివర్‌ఫ్రంట్ ఏర్పాటు చేశారు. ఆ అభివృద్ధిని భాజపా ఎన్నికల అజెండాగా మార్చారు. ఆయా రాష్ట్రాల్లో నదుల ప్రక్షాళనను వ్యతిరేకించడం లేదని రేవంత్ వివరించారు. కొందరు కడుపులో విషం తగ్గించుకుంటే మంచిదని విపక్ష పార్టీలోని పలువురు కీలక నేతలకు సీఎం రేవంత్ రెడ్డి హితవు పలికారు. మూసీ కాలుష్యం కంటే కొందరు మనుషుల కడుపులో ఉన్న విషం అత్యంత ప్రమాదకరమన్నారు. తాను వివరాలు చెబుతుంటే ఎందుకు విషం కక్కుతున్నారంటూ విపక్ష సభ్యులను ఆయన సూటిగా నిలదీశారు. ప్రజలకు నిజాలు తెలియవద్దని చర్చ జరగకుండా చూడాలనుకుంటున్నారా? అని వారిని ప్రశ్నించారు. వివరాలు చెబుతుంటే నొప్పి ఎందుకు మీకు అంటూ విపక్ష సభ్యులపై ఆయన మండిపడ్డారు. మూసీకి అడ్డంగా పడుకుంటామంటున్న వారు..మొన్న వర్షాలు వచ్చినప్పుడు ఎక్కడికిపోయారంటూ వారిని సీఎం రేవంత్ రెడ్డి కడిగేశారు. కొంతమంది తనను రియల్ ఎస్టేట్ బ్రోకర్ అంటున్నారని.. రియల్ ఎస్టేట్ సైతం ఒక ఇండస్ట్రీనే అని ఆయన వివరించారు. హైటెక్ సిటీ నిర్మించాలనుకున్నప్పుడు కూడా ఇలాంటి విమర్శలే చేశారని పేర్కొన్నారు. రోజు రోజుకు పట్టణీకరణ పెరుగుతుందని చెప్పారు. రాబోయే 20 ఏండ్లలో 75 శాతానికి పట్టణీకరణ పెరుగుతుందని తెలిపారు. తెలంగాణలో మూసీ నది 240 కిలోమీటర్లు ప్రవహిస్తుందన్నారు. అనంతగిరి హిల్స్ నుంచి వాడపల్లి వరకు మూసీ ప్రవాహం ఉందన్నారు. మూసీ, ఈసీ నదులు కలిసే చోటు బాపుఘాట్ నిర్మిస్తామని.. అందుకే అక్కడ గాంధీసరోవర్ ప్రాజెక్ట్ చేపట్టామని తెలిపారు. నదీ పరివాహక ప్రాంతంలోనే అభివృద్ధి జరుగు తుందని పేర్కొన్నారు. మూసీ నది ప్రక్షాళనను మొదట 21 కిలోమీటర్లు చేయాలని చూస్తున్నామని.. హిమాయత్‌సాగర్ నుంచి గాంధీ సరోవర్ వరకు అభివృద్ధి చేస్తామని చెప్పారు. మార్చిలో తొలి దశ పనులు ప్రారం భిస్తామన్నారు. సంక్రాంతిలోగా తొలి దశ డీపీఆర్‌పై క్లారిటీ ఇస్తామని పేర్కొన్నారు. గండిపేట నుంచి గౌరెల్లి వరకు 51 కి.మీ మూసీ అభివృద్ధి చేస్తామని వివరించారు. 51 కి.మీ ఎలివేటెడ్ కారిడార్లు నిర్మిస్తామన్నారు. మీరాలం ట్యాంక్ కూడా మూసీ అభివృద్ధిలో భాగమేనని స్పష్టం చేశారు. ఈ ట్యాంక్‌పై రూ. 450 కోట్లతో బ్రిడ్జి నిర్మిస్తున్నామని సీఎం రేవంత్ చెప్పారు. నదులు కలుషితం చేసి నివాసయోగ్యం కాని ప్రాంతాలుగా చేశారని మండిపడ్డారు. నదీ పరివాహక ప్రాంతాల నిర్వాసితులకు ప్రత్యామ్నాయం కోరామని చెప్పారు. మూసీ నది కలుషితం కారణంగా నల్లగొండ జిల్లాలో ప్రజలు జీవించలేని పరిస్థితి నెలకొందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కలుషిత నీటి నుంచి కాపాడాలని వేలాదిగా విజ్ఞప్తులు వచ్చాయన్నారు. ఏడాదంతా మూసీలో నీళ్లు ప్రవహించేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు చెప్పారు. మూసీ పరివాహక ప్రాంతంలో ఆలయాలు, మసీదులు, గురుద్వారాలు, చర్చి నిర్మిస్తామని తెలిపారు. మూసీ నదిని ప్రక్షాళన చేయాల్సిందేనని స్పష్టం చేశారు. వచ్చే మూడు నెలల్లో అంచనాలు ఫైనల్ చేస్తామని ప్రకటించారు. ఏడీబీ బ్యాంకు రూ. 4,100 కోట్ల రుణం ఇస్తుందన్నారు. త్వరలో అన్ని వివరాలు వెల్లడిస్తామని సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. డిపిఆర్ పూర్తయ్యాక అసెంబ్లీలో చర్చిస్తామని, సభ్యుల సూచనలు కూడా స్వీకరిస్తామని అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ రెడ్డి కీలక సూచన చేశారు. మీ నియోజకవర్గాల్లో ఎలాంటి అభివృద్ధి కావాలో చెప్పాలని సూచించారు. పేదలకు మంచి ఇళ్లు కట్టించి వారికి మెరుగైన వసతులు కల్పిద్దామని పిలుపుని చ్చారు. హైదరాబాద్‌ను ప్రపంచస్థాయి నగరంగా తీర్చిదిద్దాలనేదే తమ సంకల్పమని ఆయన స్పష్టం చేశారు. తాము మంచి పని చేయాలనుకుంటున్నాం? మీ సూచనలు సలహాలు ఇవ్వాలన్నారు. డీపీఆర్ సిద్ధమయ్యాక ఎమ్మెల్యేలందరికీ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చి సలహాలు తీసుకుంటామని గ్రేటర్ పరిధిలోని ఎమ్మెల్యేలకు సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు.

# నేటి నుంచి స్పెషల్ ఆఫీసర్ల పాలన

## ముగిసిన జిహెచ్ఎంసి పాలక మండలి గడువు - మూడు కార్పొరేషన్లుగా విభజన

**హైదరాబాద్, ఫిబ్రవరి 10, (తెలంగాణ దిశ) :** గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జిహెచ్ఎంసి) ప్రస్తుత పాలక మండలి గడువు నేటితో ముగియనుంది. ఈ నేపథ్యంలో జిహెచ్ఎంసిని మూడు వేర్వేరు కార్పొరేషన్లుగా విభజిస్తూ తెలంగాణ ప్రభుత్వం కీలక ప్రకటన చేయనున్నట్లు సమాచారం. ఇప్పటికే ఈ మార్పులకు సంబంధించిన పరిపాలనా ఏర్పాట్లు దాదాపుగా పూర్తయ్యాయి.

**మూడు కార్పొరేషన్లు ఇవే..**

1. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, 2. గ్రేటర్ మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్, 3. గ్రేటర్ సైబరాబాద్ (గ్రేటర్ శేరిలింగంపల్లి) మున్సిపల్ కార్పొరేషన్ లను ఏర్పాటు చేశారు.


**కార్యాలయాల ఏర్పాట్లు పూర్తి**

మూడు కార్పొరేషన్‌లకు అవసరమైన కార్యాలయాలను అధికారులు ఇప్పటికే సిద్ధం చేశారు.

ప్రస్తుత జిహెచ్ఎంసి ప్రధాన కార్యాలయంలోనే గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం కొనసాగనుంది. తార్నాక హుడా కార్యాలయంలో గ్రేటర్ మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఏర్పాటు చేశారు. మాదాపూర్ నాక్ భవనంలో గ్రేటర్ సైబరాబాద్ (గ్రేటర్ శేరిలింగంపల్లి) మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం పనిచేయనుంది.

**వార్డులు, జోన్ల విభజన**

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ లో 150 వార్డులతో




పాటు ఖైరతాబాద్, సికింద్రాబాద్, చార్మినార్, రాజేంద్రనగర్, శంషాబాద్, గోల్కొండ సర్కిల్లో ఉన్నాయి. అదేవిధంగా గ్రేటర్ మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ ను 74 వార్డులతో ఏర్పాటు చేశారు.

ఇందులో మల్కాజిగిరి, ఉప్పల్, ఎల్ బీ నగర్ సర్కిల్లున్నాయి. గ్రేటర్ సైబరాబాద్ (గ్రేటర్ శేరిలింగంపల్లి) 76 వార్డులతో కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ శేరిలింగంపల్లి సర్కిల్తో ఏర్పాటు చేశారు.

**స్పెషల్ ఆఫీసర్ల పాలన**

జిహెచ్ఎంసి ఎన్నికలు పూర్తయ్యే వరకు మూడు కార్పొరేషన్‌లు స్పెషల్ ఆఫీసర్ల పాలనలో కొనసాగనున్నాయి. గ్రేటర్ హైదరాబాద్ ప్రస్తుత జిహెచ్ఎంసి కమిషనర్ కర్ణన్, గ్రేటర్ మల్కాజిగిరి కమిషనర్ గా వినయ్ కృష్ణారెడ్డి, గ్రేటర్ సైబరాబాద్ (గ్రేటర్ శేరిలింగంపల్లి) కమిషనర్ గా సృజన బాధ్యతలు చేపట్టనున్నారు.

**ఆగస్టులోపు ఎన్నికల అవకాశం**

ప్రభుత్వ నిబంధనల ప్రకారం పాలక మండలి గడువు ముగిసిన ఆరు నెలల్లోపు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ఆగస్టు నెలలోపు జిహెచ్ఎంసి ఎన్నికలు జరిగే అవకాశాలు ఉన్నట్లు రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

**విస్తీర్ణం, జనాభా**

ఒకప్పుడు కేవలం 650 చదరపు కిలోమీటర్లకు పరిమితమైన జిహెచ్ఎంసి, అవుటర్ రింగ్ రోడ్ (ఓఆర్ఆర్) వరకు విస్తరించడంతో ప్రస్తుత విస్తీర్ణం 2050 చదరపు కిలోమీటర్లకు పెరిగింది.

అదే విధంగా జనాభా సుమారు 1 కోటి 34 లక్షలు కు చేరుకుంది. జిహెచ్ఎంసిని మూడు కార్పొరేషన్‌లుగా విభజించడం ద్వారా పరిపాలన మరింత సులభతరం అవుతుందని, ప్రజలకు మున్సిపల్ సేవలు వేగంగా అందనున్నాయని ప్రభుత్వం భావిస్తోంది. అయితే ఈ నిర్ణయం రాజకీయంగా ఎలాంటి ప్రభావం చూపుతుందన్న అంశంపై ఆసక్తికర చర్చ కొనసాగుతోంది.

# అభివృద్ధి పనులతో మారనున్న ఉప్పల్ నియోజకవర్గ రూపురేఖలు

## నియోజకవర్గంలో రూ. 115.85 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

### - తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు



**ఉప్పల్, ఫిబ్రవరి 10, (తెలంగాణ దిశ):** ప్రజా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులతో ఉప్పల్ నియోజకవర్గ రూపురేఖలు పూర్తిగా మారనున్నాయని తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. మంగళవారం నియోజకవర్గ పరిధిలోని వివిధ డివిజన్ లల్లో రూ. 115.85 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవతో ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి భారీగా నిధులు కేటాయిస్తున్నారని తెలిపారు. నిధులు కేటాయించడమే కాకుండా, కాప్రాలో అంతర్జాతీయ స్థాయి క్రీడా కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం ముందుకు వెళుతుందని అన్నారు. క్రీడాకారులకు అత్యాధునిక వసతులు కల్పించి, తెలంగాణ నుంచి ఒలింపిక్స్, ఏషియన్ గేమ్స్ వంటి అంతర్జాతీయ క్రీడా పోటీల్లో ప్రతిభ కనబర్చే క్రీడాకారులను తయారు చేయడమే సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. హైదరాబాద్, ఉప్పల్ ప్రాంతాలు క్రీడా రంగంలో దేశానికి ఆదర్శంగా నిలవాలన్న దిశగా ప్రభుత్వం పని చేస్తోందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ పట్నం మహేందర్ రెడ్డి, గ్రేటర్ హైదరాబాద్ మేయర్ గద్వాల విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత, ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి, కార్పొరేటర్లు, స్థానిక నాయకులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉప్పల్ నియోజకవర్గంలో మొత్తం రూ. 115.85 కోట్లతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు మంత్రి శ్రీధర్ బాబు శ్రీకారం చుట్టారు.

**రూ.115.85 కోట్లతో ఉప్పల్ నియోజకవర్గ అభివృద్ధికి శ్రీకారం**

ఉప్పల్ నియోజకవర్గంలో సమగ్ర అభివృద్ధి దిశగా కీలక అడుగు పడింది. మొత్తం రూ. 115.85 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని మౌలిక వసతులు, పారిశుద్ధ్యం, విద్య, క్రీడా రంగాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తుందని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. ఉప్పల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని అన్నారు. నియోజకవర్గ పరిధిలోని కాప్రా, చర్లపల్లి, మీర్‌పేట్ హెచ్ బి కాలనీ, ఉప్పల్ డివిజన్లలో సమాధి స్థలాల అభివృద్ధి, సీసీ రోడ్లు, వర్షపు నీటి కాలువలు, బాక్స్ డ్రెయిన్లు, క్రీడా మైదానాలు, ఇండోర్--అవుట్ డోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లు, పాఠశాల భవనాలు, పార్కుల అభివృద్ధి, తాగునీటి సౌకర్యాలు ఉన్నాయి. ప్రత్యేకంగా ఉప్పల్ నియోజకవర్గంలో క్రీడా రంగానికి పెద్దపీట వేస్తూ అంతర్జాతీయ స్థాయి సౌకర్యాల కల్పన, పారిశుద్ధ్య సమస్యలకు శాశ్వత పరిష్కారం, ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు అందించడమే ఈ పనుల ఉద్దేశ్యమని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కార్పొరేటర్లు, స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ దేవి వార్షికోత్సవ వేడుకలు






**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 10,(తెలంగాణ దిశ) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం మహాదేవపురం డివిజన్ పరిధిలోని బాలయ్య నగర్‌లోని శ్రీశ్రీశ్రీ రేణుక ఎల్లమ్మ దేవి 22వ వార్షికోత్సవ వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఈ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం జరిగిన ముఖ్యమైన ఎల్లమ్మ జాతర కార్యక్రమానికి స్థానిక మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ ఆలయ కమిటీ ఆహ్వానం మేరకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన రేణుక ఎల్లమ్మ దేవిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆయనను శాలువాతో ఘనంగా సత్కరించి, అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ గత 22 సంవత్సరాలుగా నిరంతరంగా అమ్మవారి వార్షికోత్సవాలు నిర్వహించడం ఎంతో ఆనందకరమైన విషయమన్నారు. రేణుక ఎల్లమ్మ దేవి ఆశీస్సులు, కృపాకటాక్షాలతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని మనస్ఫూర్తిగా కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక డివిజన్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.

# ఏపీకి ఆర్థిక కష్టాలు!

విజయవాడ, : ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పరిస్థితి రోజురోజుకీ కఠినంగా మారుతోందన్న అభిప్రాయం బలపడుతోంది. 2014 జూన్ 2 న రాష్ట్ర విభజన జరిగినప్పటినుంచి ఇప్పటివరకు పూర్తిస్థాయిలో ఆర్థిక ఇబ్బందుల నుంచి బయటపడలేకపోయిందన్నది వాస్తవం. రాజకీయంగా తీవ్రమైన పోటీ ఉండటంతో అధికారంలోకి రావడమే లక్ష్యంగా పార్టీలు అనేక ఉచిత హామీలు ఇస్తూ వచ్చాయి. అదే సమయంలో ఆదాయ వనరులు బలపడకపోవడం రాష్ట్ర ఖజానాపై తీవ్ర ఒత్తిడిని తీసుకొచ్చింది.విభజన సమయంలోనే ఏపీ భారీ రెవెన్యూ లోటుతో ప్రారంభమైంది. కాగ్ నివేదిక ప్రకారం 2014?15 ఆర్థిక సంవత్సరంలోనే దాదాపు 24,194 కోట్ల రూపాయల లోటు నమోదైంది. ఆ తర్వాత ఆదాయాన్ని తెచ్చే హైదరాబాద్ వంటి మహానగరం లేకపోవడంతో లోటు క్రమంగా పెరుగుతూ వచ్చింది. సంవత్సరానికోసారి ఆదాయానికి, ఖర్చులకు మధ్య అంతరం పెరిగి చివరకు సాధారణ పరిపాలనా అవసరాలకే రుణాలు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందిఈ పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వం రెండో దశ జీఎస్టీ సంస్కరణల పేరుతో ఈ ఏడాది అక్టోబర్ నుంచి కొత్త స్లాబులు అమల్లోకి తీసుకొచ్చింది. మధ్యతరగతి, దిగువ తరగతికి ఊరట కలిగించాలన్న ఉద్దేశంతో అనేక వస్తువులను జీఎస్టీ పరిధి నుంచి మినహాయించారు. దీని వల్ల రాష్ట్రాలకు వచ్చే ఆదాయం తగ్గిపోయింది. ఏపీకి సుమారు ఎనిమిది వేల కోట్ల రూపాయల వరకు నష్టం వాటిల్లుతుందన్న అంచనాలు అప్పుడే వినిపించాయి. కానీ వాస్తవంగా చూస్తే ఈ ప్రభావం మరింత తీవ్రంగా కనిపిస్తోందని అధికారులు చెబుతున్నారు.గణాంకాలు పరిశీలిస్తే గత ఏడాది అక్టోబర్‌లో జీఎస్టీ ద్వారా రాష్ట్రానికి 2,777 కోట్ల రూపాయలు ఆదాయం రాగా, ఈ ఏడాది అదే నెలలో అది స్పష్టంగా తగ్గింది. అలాగే గత ఏడాది నవంబర్ లో 2,827 కోట్ల రూపాయలు వచ్చిన చోట ఈ ఏడాది నవంబర్‌లో కేవలం 2,697 కోట్ల రూపాయలకే పరిమితమైంది. అంటే సుమారు నాలుగు శాతం కంటే ఎక్కువగా ఆదాయం తగ్గినట్టు లెక్కలు చెబుతున్నాయి.జీఎస్టీ వల్ల రాష్ట్రాలకు వచ్చిన నష్టాన్ని కేంద్రం ఏదో రూపంలో భర్తీ చేయాల్సి ఉన్నా, ఆ దిశగా స్పష్టమైన చర్యలు కనిపించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఏపీకి ఈ దెబ్బ ఎక్కువగా తగిలిందని విశ్లేషకులు అంటున్నారు.

# వర్కవుట్ చేద్దాం ఫ్రెండ్స్..



'జిమ్‌కు ఎందుకు వెళ్తున్నావ్?' అని ఎవరినైనా అడిగితే.. స్లిమ్ కావడానికనో.. కండలు పెంచడానికనో సమాధానం చెప్పడం సహజం. కానీ, నేటి యంగ్ తరంగ్‌లు దీనికి భిన్నంగా స్పందిస్తున్నారు. 'ఫిట్‌నెస్ కోసం మాత్రమే కాదు.. ఫ్రెండ్‌షిప్ కోసం కూడా' అని చెబుతున్నారు. జిమ్‌లో కేవలం చెమటలు కక్కడమే కాదు.. చనువుగా మాటలూ కలుపుతున్నారు. కండలు మాత్రమే కాదు.. నెట్‌వర్క్ కనెక్షన్లూ పెంచుకుంటున్నారు. 'ఫిట్‌నెస్.. ఫ్లెక్సింగ్.. ఫ్రెండ్‌షిప్' అన్నీ కలిపి జెన్ జెడ్ కొత్త ట్రెండ్‌ను ఫాలో అవుతున్నది. ఆన్‌లైన్‌లో దొరికే దోస్తుల కన్నా.. జిమ్‌లో కలిసే ఫ్రెండ్ బెస్ట్ అంటున్నది నేటి తరం. ఇతర వేదికల్లో పరిచయాలైన తర్వాత.. అభిరుచులు కలిస్తేనే స్నేహం చిగురించే అవకాశాలు ఉంటాయి. అదే జిమ్ స్నేహాల్లో అందరి కామన్ మంత్రం ఫిట్‌నెస్. అభిరుచులు కలిసిన తర్వాత అభిప్రాయాలు కలవడం ఎంతసేపు? అందుకే, జిమ్ స్నేహాలు ఇటీవల తెగ వర్కవుట్ అవుతున్నాయని పలు డేటింగ్ యాప్‌లు నిర్వహించిన సర్వేల్లో తేటతెల్లమైంది. డేటింగ్ యాప్ బంబుల్ 'ఫిట్‌నెస్ సెంట్రిక్ డేట్స్' కోసం క్యాంపెయిన్లు కూడా మొదలుపెట్టింది. వీళ్లు నిర్వహించిన ఓ సర్వేలో 52 శాతం జెన్ జెడ్ ఇండియన్ సింగిల్స్.. ఫిట్‌నెస్ సెంట్రిక్ డేట్‌కి ఆసక్తి చూపిస్తున్నారట. 95 శాతం మంది 'స్పోర్ట్స్ ఫస్ట్ డేట్'కి ఓటేస్తున్నారట. తమ పార్ట్‌నర్‌కు గానీ, ఫ్రెండ్‌కు గానీ ఆటలపై మోజు లేకుంటే 44 శాతం మంది వారితో 'డీల్ బ్రేకప్' అని నిర్మొహమాటంగా చెప్పేస్తున్నారట. అంతేకాదు, వర్కవుట్ ప్లేస్‌లో చిగురించిన స్నేహాలు.. యువతను జిమ్‌కు ఉత్సాహంగా వెళ్లడానికి ప్రేరణగా నిలుస్తున్నాయట కూడా!

**కొంగుముడి దాకా..:** 2024లో స్పోర్ట్ అండ్ ఫిట్‌నెస్ యాప్ స్ట్రావా విడుదల చేసిన 'ఇయర్ ఇన్ స్పోర్ట్' సర్వే రిపోర్ట్ ఆసక్తికరమైన విషయాలను వెల్లడించింది. ఈ సర్వేలో పాల్గొన్నవారిలో 58 శాతం మంది తమకు జిమ్‌లో కొత్త ఫ్రెండ్ కలిశారని చెప్పుకొచ్చారు. ఇక ప్రతి ఐదుగురిలో ఒకరు తమ వర్కవుట్ ఫ్రెండ్‌తో డేటింగ్‌కు కూడా వెళ్తున్నారని వెల్లడైంది. వీరిలో కొందరు కొంగుముడి కూడా వేసుకుంటున్నారట. పబ్ కన్నా.. జిమ్‌లో ఏర్పడే పరిచయాలు సురక్షితం, సున్నితం, ఉపయోగకరం అని ఈ జనరేషన్ భావిస్తున్నది. జిమ్‌లు కొందరికి డేటింగ్‌కు దారి చూపితే.. మరికొందరికి కెరీర్ నెట్‌వర్కింగ్ హబ్‌లా పనిచేస్తున్నాయి. 'నా జిమ్ ఫ్రెండ్ ద్వారా నాకు జాబ్ రిఫరల్ కూడా వచ్చింది' అని హ్యాపీగా పోస్టు చేస్తున్నారు పలువురు.

**సోషల్ క్లబ్స్‌గా..:** నయా జనరేషన్ ఆసక్తులను గమనించిన జిమ్ నిర్వాహకులు తమ కార్యకలాపాల్లో మార్పులు తీసుకొస్తున్నారు. కల్ట్‌ఫిట్ లాంటి సంస్థలు క్లయింట్స్ కోసం గ్రూప్ వర్కవుట్స్ అందిస్తు న్నాయి. మైక్రో ఈవెంట్లు, జాయింట్ వర్కవుట్స్, టీమ్ బేస్డ్ ఇలా రకరకాల చాలెంజెస్‌ని పరిచయం చేస్తున్నాయి. జిమ్‌లో చిగురించిన బంధాలు మరింత బలపడటానికి క్రాఫ్ట్ వర్క్‌షాప్స్, మారథాన్స్, పెయింటింగ్ సెషన్స్ కూడా నిర్వహిస్తున్నాయి. అందుకే, జిమ్ అంటే తమకు రొటీన్ కాదనీ, రిలేషన్స్‌కు వారధి అని భావిస్తున్నారు యువతీయువకులు. కలిసి వర్కవుట్ అయినప్పుడు కలిసి జీవించేం దుకు ఇష్టపడుతున్నారు. ట్రెడ్‌మిల్‌పై పరుగులు తీస్తూ.. ట్రెండింగ్‌గా పార్ట్‌నర్‌ని వెతుక్కుంటున్నారు. మొత్తంగా జిమ్ బాట పట్టినవారు ఫిట్‌నెస్ సంపాదించుకోవడంతో పాటు బోనస్‌గా సామాజికంగా యాక్టివ్‌గా మారుతున్నారు. ఈ ట్రెండ్‌ను మనమూ స్వాగతిద్దాం!!



## పెరుగు, బెల్లం మిశ్రమాన్ని
# రోజూ తినండి..

**ఎన్ని లాభాలు కలుగుతాయో మీరే చూస్తారు..**

వేసవి కాలంలో అందరూ చల్లని పదార్థాలను లేదా శరీరానికి చలువ చేసే ఆహారాలను తింటుంటారు. అలాంటి ఆహారాల్లో పెరుగు కూడా ఒకటి. ఈ కాలంలో పెరుగును చల్లగా తింటే ఎంతో మేలు జరుగుతుంది. ఇది మన శరీరంలోని వేడిని తగ్గించి వేసవి తాపం నుంచి ఉపశమనం అందిస్తుంది. శరీరం డీహైడ్రేషన్ బారిన పడకు ండా చూస్తుంది. ఎండ దెబ్బ నుంచి రక్షిస్తుంది. అయితే పెరుగులో కాస్త బెల్లం కలిపి ఇంకా ఎంతో మేలు జరుగుతుందని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. పెరుగులో బెల్లం కలిపి తినడం వల్ల ఎన్నో పోషకాలను పొందవచ్చు. పెరుగు, బెల్లం మిశ్రమాన్ని తింటే జీర్ణాశయంలో ఎంజైమ్‌లు ఉత్పత్తి అవుతాయి. ఇవి మలబద్దకాన్ని తగ్గిస్తాయి. పెరుగు ప్రో బయోటిక్ ఆహారాల జాబితాకు చెందుతుంది. ఇది జీర్ణవ్యవస్థలో ఉండే మంచి బ్యాక్టీరియాను వృద్ధి చేస్తుంది. దీంతో జీర్ణ వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది.

**మహిళల సమస్యలకు..:** పెరుగు, బెల్లం మిశ్రమంలో యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఉంటాయి. ఇవి రోగ నిరోధక వ్యవస్థను పటిష్టం చేస్తాయి. దీంతో శరీర రోగ నిరోధక శక్తి పెరుగుతుంది. శరీరం వ్యాధులు, ఇన్‌ఫెక్షన్లకు వ్యతిరేకంగా పోరాడుతుంది. పెరుగు, బెల్లం మిశ్రమాన్ని తినడం వల్ల మహిళలకు నెలసరి సమయంలో వచ్చే నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది. అధిక రక్తస్రావం తగ్గుతుంది. ముఖ్యంగా కడుపు నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది. పెరుగు, బెల్లం మిశ్రమం ద్వారా ఐరన్ సమృద్ధిగా లభిస్తుంది. ఇది రక్తం తయారయ్యేలా చేస్తుంది. రక్తహీనతను తగ్గిస్తుంది. బరువు తగ్గాలని చూస్తున్న వారు పెరుగు, బెల్లం మిశ్రమాన్ని తింటే మేలు జరుగుతుంది. ఈ మిశ్రమాన్ని తింటే శరీర మెటబాలిజం పెరుగుతుంది. దీంతో క్యాలరీలు ఖర్చయి కొవ్వు కరుగుతుంది. అధిక బరువు తగ్గుతారు.


**నాడీ మండల వ్యవస్థకు..:** పెరుగులో బెల్లం కలిపి తింటే రక్త ప్రసరణ మెరుగు పడుతుంది. నాడీ మండల వ్యవస్థ ఆరోగ్యంగా ఉంటుంది. మానసిక ప్రశాంతత లభిస్తుంది. మైండ్ రిలాక్స్ అయి రాత్రి పూట నిద్ర చక్కగా పడుతుంది. ఒత్తిడి, ఆందోళన తగ్గుతాయి. నాడీ సంబంధ వ్యాధులు తగ్గుతాయి. దీంతో జ్ఞాపకశక్తి, ఏకాగ్రత పెరుగుతాయి. ఈ మిశ్రమాన్ని తీసుకుంటుంటే పురుషుల్లో లైంగిక పటుత్వం పెరుగుతుంది. శృంగారంలో యాక్టివ్‌గా పాల్గొంటారు. పెరుగు, బెల్లం మిశ్రమంలో పొటాషియం అధికంగా ఉంటుంది. ఇది రక్త సరఫరాను మెరుగు పరుస్తుంది. దీంతో బీపీ కంట్రోల్ అవుతుంది. హైబీపీ తగ్గుతుంది. బీపీ ఉన్నవారు ఈ మిశ్రమాన్ని రోజూ తింటుంటే ఎంతో మేలు జరుగుతుంది.

**ఎముకల ఆరోగ్యానికి..:** పెరుగు, బెల్లం మిశ్రమంలో క్యాల్షియం కూడా అధికంగానే ఉంటుంది. ఇది ఎముకలు, దంతాలను దృఢంగా, ఆరోగ్యంగా మారుస్తుంది. ఈ మిశ్రమంలో ఉండే ఐరన్ దగ్గు, జలుబు వంటి అనారోగ్య సమస్యలను తగ్గిస్తుంది. పెరుగు, బెల్లం మిశ్రమంలో పలు రకాల బి విటమిన్లు ఉంటాయి. ఇవి మనల్ని ఆరోగ్యంగా ఉంచుతాయి. రోగాల నుంచి రక్షిస్తాయి. ఈ మిశ్రమాన్ని రోజూ తింటే శరీరం అంతర్గతంగా శుభ్రంగా మారుతుంది. శరీరంలోని వ్యర్థాలు, టాక్సిన్లు బయటకు పోతాయి. ఇలా ఈ మిశ్రమాన్ని రోజూ తినడం వల్ల అనేక లాభాలను పొందవచ్చు. అయితే కఫం సమస్య అధికంగా ఉన్నవారు ఈ మిశ్రమాన్ని రాత్రి పూట తినకూడదు. మధ్యాహ్నం తినాలి.

# ఆత్మవిశ్వాసమే అసలైన ఆస్తి..

ఆత్మవిశ్వాసం.. పిల్లలకు తల్లిదండ్రులు అందించాల్సిన అసలైన ఆస్తి. కాన్ఫిడెంట్‌గా ఉంటేనే.. వారి భవిష్యత్తు బాగుంటుంది. ఎలాంటి సవాళ్లు ఎదురైనా.. ధైర్యంగా ఎదుర్కొనే 'శక్తి' లభిస్తుంది. అయితే.. ఇది రాత్రికి రాత్రే వచ్చేదికాదనీ, తల్లిదండ్రులు తమ పిల్లలకు చిన్నప్పటి నుంచే వారిపై వారికి నమ్మకాన్ని కలిగించాలని మానసిక నిపుణులు చెబుతున్నారు. వారిపై మీరు చూపించే ప్రేమ, విశ్వాసం, ఇంట్లో వారిని ఎలా చూసుకుంటున్నారు? అనే విషయాలే.. వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతాయనీ అంటున్నారు. చిన్నచిన్న విషయాల్లో.. నిర్ణయాలను పిల్లలకే వదిలేయండి. బయటికి వెళ్లేటప్పుడు ఏ డ్రెస్ వేసుకోవాలో.. సాయంత్రం స్నాక్స్ కోసం ఏం సిద్ధం చేయాలో.. వారినే నిర్ణయించుకోమని చెప్పండి. వారి నిర్ణయాలను గౌరవించండి. ఈ చిన్న అలవాటే.. పిల్లల్లో సొంతంగా ఆలోచించుకొనే సామర్థ్యాన్ని పెంచుతుంది. భవిష్యత్తులో పెద్దపెద్ద నిర్ణయాలు సులువుగా తీసుకోగలిగే విశ్వాసాన్ని అందిస్తుంది.

చదువుల్లోనైనా, ఆటల్లోనైనా ఫలితం ఎలా ఉన్నా.. పిల్లల ప్రయత్నాన్ని ప్రోత్సహించండి. వారు ఎంత శ్రమిస్తున్నారనేదే ముఖ్యమని గ్రహించండి. చదువుల్లో గ్రేడ్‌లు తెచ్చుకోవడం.. ఆటల్లో కప్పులు కొట్టేయడం మాత్రమే 'విజయం సాధించినట్టు' కాదన్న విషయం వారికి బాల్యం నుంచే నేర్పించండి. ఓడిపోయినప్పుడు కూడా వారి వెన్ను తట్టండి. ఇలాంటి ప్రోత్సాహం.. పిల్లల్లో సానుకూల మనస్తత్వాన్ని పెంచుతుంది. ఎలా గెలవాలో.. సమస్యలు ఎదురైతే ఎలా పోరాడాలో వారికి నేర్పుతుంది. ఎప్పుడూ పరిపూర్ణంగా ఉండలేమనే విషయాన్ని కూడా పిల్లలకు బోధపరుస్తుంది. పిల్లలు స్కూల్‌నుంచి వచ్చినప్పుడో.. మీరు ఆఫీస్‌నుంచి ఇంటికి వెళ్లినప్పుడో.. మీ చిన్నారులను దగ్గరికి తీసుకొని కౌగిలించుకోండి. దీనివల్ల వారు భావోద్వేగానికి లోనవుతారు. వారిలో ఆక్సిటోసిన్ హార్మోన్ స్థాయులు పెరుగుతాయి. వారి మానసిక స్థితిని మెరుగుపర్చడంలో ఇది సాయపడుతుంది. దాంతో పిల్లలు మానసికంగా మరింత బలంగా తయారవుతారు. రోజూ ఇలా చేయడం వల్ల పిల్లల్లో జీవితం పట్ల సానుకూల దృక్పథం పెరుగుతుంది. ఏ సందర్భంలోనైనా కుటుంబం తనకు అండగా ఉంటుందనే భరోసా కలుగుతుంది. ఇంట్లో సురక్షితంగా ఉన్నామని



భావించే పిల్లలు.. మరింత ఆత్మవిశ్వాసంతో పెరుగుతారు. ఒక చిన్న అభినందన.. వారికి కొండంత ఆత్మవిశ్వాసాన్ని ఇస్తుంది. చిన్న విజయమైనా.. మీ ప్రశంస పెద్దగా ఉండాలి. అప్పుడే.. వారిలో పదేపదే ప్రశంసలు పొందాలనే భావన కలుగుతుంది. మీ అభినందనలే.. వారిలో సృజనాత్మకతను వెలికితీస్తాయి. కాబట్టి, మీ పిల్లలు చేసిన ప్రతి మంచి పనినీ అభినందించండి. దీంతో వారు మరిన్ని మంచి పనులు చేయడానికి ఉత్సాహం చూపుతారు. ఆ ప్రయత్నంలో ఓడినా – గెలిచినా అభినందిస్తే.. వారిని మరో ప్రయాణానికి ప్రేరేపిస్తుంది.

## రోజూ రెండుసార్లు మజ్జిగ తాగండి..!
# బరువు తగ్గండి ...!



లావుగా ఉండటం తప్పుకాదు. కాని తగ్గటం చాలా అవసరం ...! అందుకని ఉపవాసం ఉండకూడదు. కానీ ఒళ్ళు పెంచే ఆహారం తినకూడదని తెలుసుకోవాలి. శరీరపు బరువు సమతుల్యమై.. శరీరాకృతి పాడవకుండా ఉండాలంటే.. ఆత్మస్థైర్యం ఉండాలి. ఇంకా శరీరపు బరువును పెంచే నెయ్యి, తీపి పదార్థాలు, పెరుగు, మాంసం, వేపుడు కూరలు, నూనె వస్తువులు ముఖ్యంగా వేరుశెనగ నూనె, దుంపకూరలు, మినుముతో చేసే పదార్థాలు తినకండి. మజ్జిగ ఒళ్ళును పెరగనివ్వదు. రోజూ రెండుసార్లు మజ్జిగ తాగండి. అన్నం తినేముందు కనీసం నాలుగు గంటలు రాగి చెంబులో నిల్వ ఉంచిన నీటిని కొంచెం తాగండి. రోజూ పరగడుపున అరగ్లాసు గోరు వెచ్చని నీళ్ళలో చెమ్చాన్నర తేనె కలుపుకుని తాగండి. మధ్యాహ్నం నిద్రపోకండి. రాత్రి అన్నం తిన్నాక కనీసం వంద అడుగులు నడిచి అప్పుడు పడుకోండి.. ఇంకా అర గంట సేపు నడవటం, సూర్య నమస్కారాలు చేయడం మంచిది. ఇంకా మిరియాలు, అల్లం, పిప్పలి, ఉసిరికాయ, నిమ్మకాయ, జీలకర్ర, ధనియాలు, వాము.. వీటిని ఆహారంలో చేర్చుకోవాలి. చారు, కూర, పుదీనా చట్నీలో వీటిని చేర్చుకోవడం ద్వారా బరువు తగ్గవచ్చునని ఆయుర్వేద నిపుణులు అంటున్నారు.

# గోటి అంచున వసంతం!



రుతువుల్లో అందమైనది ఏదీ అంటే వసంతానికే ఓట్లు ఎక్కువ పడతాయి. ఆకురాల్చడం నుంచి అందమైన పూలు పూసే దాకా సాగే కాలపు ముచ్చటైన మజిలీ ఇది. లేలేత చిగుళ్లు, చూడచక్కని వర్ణాల్లో విరబూసే విరిబాలలూ ఇక్కడి అలంకారాలు. అందుకే వసంతం అంటే ఓ ప్రత్యేకత. మనసును కట్టిపడేసే ఆ సౌందర్యాన్ని ఫ్యాషన్ మాత్రం ఎందుకు వదిలేస్తుంది! లేత తమలపాకులను పోలిన స్త్రీల గోటి మీద ప్రదర్శించి తన తరహాలో ప్రకృతికి కితాబునిస్తుంది. అం దుకే ఇప్పుడు 'స్ప్రింగ్ నెయిల్స్' అన్నది కొత్త నెయిల్ ట్రెండ్. లేలేత వన్నెలు, చిన్ని చిన్ని పువ్వులు గోళ్ల మీద ముద్రించడమే ఇందులో ప్రత్యేకత. లేత గులాబీ, ఆకాశ నీలం, గోధుమ వన్నెలు ఎక్కువగా ఉంటాయిందులో. దాని మీద లేత చిగుళ్లు, చిట్టి పుష్పాలను నెయిల్ ఆర్ట్‌లాగా వేస్తారు. బంగారు రంగు ఫినిషింగ్‌లు, సన్నటి చుక్కల్లా మెరిసే కుందన్ల జోడింపులు అదనపు హంగులు. మొత్తానికి చూడగానే వసంతపు అందం గోటి మీద ప్రతిబింబించడమే ఈ ట్రెండ్ లక్ష్యం. మరి మీరూ వేస్తారా వసంతపు రంగులు?!

# కలవర పెడుతున్న గుండె పోట్లు



యువత గుండెలయ తప్పుతోంది. మూడు పదుల వయస్సు లోనే గుండెపో టు రావడం కలవరానికి గురిచేస్తోంది. మేడ్చల్ – మల్కాజిగిరిలో పదిహేను రోజుల వ్యవధిలోనే ముగ్గురు ఇంజినీరింగ్ విద్యార్థులు క్రికెట్ ఆడుతూ గుండెపోటుకు గురవ్వడం.. వారి తల్లిదండ్రులకు కడుపుకోత మిగిల్చింది. యువకుల గుండెలు ఒక్కసారి ఆగిపోయి మృత్యువాత పడటం చర్చనీయాంశంగా మారింది. చిన్న వయస్సులో గుండెపోటు రావడానికి కారణం మన జీవనశైలి, ఆహారపు అలవాట్లేనని, విపరీతమైన ఒత్తిడి (స్ట్రెస్), కలుషిత నీరు, గాలి, ఆహారపు అలవాట్లు, ధూమపానం, మద్యపానం ప్రధాన కారణా లని వైద్య నిపుణులు చెబుతున్నారు. సికింద్రాబాద్ ఓల్డ్ బోయిన్‌పల్లికి చెందిన యువకుడు (32) స్నేహితులతో కలిసి కీసర మండలం రాంపల్లి దాయరలోని త్యాగి స్పోర్ట్స్ వెన్యూ గ్రౌండ్‌లో క్రికెట్ ఆడేం దుకు (ఈ నెల 20న) వచ్చాడు. క్రికెట్ ఆడుతుండగా ఒక్కసారిగా గుండెపోటు రావడంతో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు. గమనించిన అతని స్నేహితులు అంబులెన్స్ సహాయంతో ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పరిక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని తెలపడంతో పోలీసులకు సమాచారం అందించారు.

సీఎంఆర్‌లో ఇద్దరు విద్యార్థులు..: మేడ్చల్‌లోని సీఎంఆర్ ఇంజినీరింగ్ కాలేజీలో ఈ నెల 4న వినయ్ అనే విద్యార్థి గుండెపోటుతో మృతి చెందాడు. స్నేహితులతో కలిసి సాయంత్రం కళాశాల మైదానంలో క్రికెట్ ఆడుతున్నాడు. మైదానంలో ఫీల్డింగ్ చేస్తుండగా, గుండెపోటుకు గురై ఒక్కసారిగా కుప్పకులాడు. స్నేహితులు ఆసుపత్రికి తీసుకువెళ్లగా పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు. అదేవిధంగా ఈ నెల 8న సీఎంఆర్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ టెక్నాలజీ కళాశాలలో సీఎస్ఈ సైబర్ సెక్యూరిటీ మూడో సంవత్సరం చదువుతున్న తుప్రాన్‌కు చెందిన సుమంత్‌కు కళాశాలకు రాగానే ఛాతిలో నొప్పి వచ్చింది. కళాశాల సిబ్బంది, స్నేహి తుల సహాయంతో సుమంత్‌ను సమీపంలోని ఆస్పత్రికి తీసుకువెళ్లారు. వైద్యులు సుమంత్‌కు వైద్యం చేసి, బాగానే ఉందని వెళ్లవచ్చని పంపించారు. మళ్లీ మధ్యాహ్నం సుమంత్ కు తీవ్రమైన గుండె నొప్పి రావడంతో తిరిగి మళ్లీ హాస్పిటల్‌కు తీసుకువెళ్లారు. చికిత్స అందిస్తుండగా మృతిచెందాడు.

కారణాలివే..: చిన్న వయస్సులో గుండెపోటుకు గురవడానికి వైద్యులు అనేక కారణాలు చెబుతున్నారు. బీజీ బీజీ జీవితాల కారణంగా శారీరక శ్రమ కరువైపోతున్నది. గుండె ఆరోగ్యంగా ఉండాలంటే శారీరకశ్రమ ఉండాలన్నది గ్రహించాలి. కరోనరీ హార్ట్ సంబంధిత మరణాల్లో దాదాపు 35 శాతం శారీరకశ్రమ లేకపోవడం వల్లనే అంచనా వేస్తున్నారు. చదువులో తీవ్రమైన ఒత్తిడికి (స్ట్రెస్) గురవడం. ఫాస్ట్ ఫుడ్, రక్తంలో చెడు కొలస్ట్రాల్ ఎక్కువగా ఉండటం. రెండు పదుల వయస్సులోనే మధుమేహం వ్యాధి వచ్చిన గుర్తించకపోవడం. శరీరం అధిక బరువు కారణంగా ధమనుల్లో కొవ్వు పదార్థాలు పేరుకుపోయేందుకు దారి తీస్తుంది. గుండెకు రక్తాన్ని సరఫరా చేసే ధమనులు దెబ్బతిన్నట్లయితే అది గుండెపోటుకు దారి తీయవచ్చు. తల్లిదండ్రులకు గుండె జబ్బులు ఉంటే, వారి పిల్లలకు చిన్నవయస్సులోనే గుండె జబ్బుల బారిన పడే అవకాశం ఉంది. వాతావరణ కాలుష్యం కూడా గుండె జబ్బులకు దారితీస్తుంది. స్మోకింగ్, ఆల్కహాల్ సేవించడం వల్ల కూడా రావచ్చు. సిగరేట్ స్మోకింగ్ అలవాటు ఇటీవల ఎక్కువైంది. ఫ్యాషన్‌గా యువకులు సిగరెట్ స్మోకింగ్ చేస్తూ.. తమ ఆరోగ్యాన్ని ప్రమాదంలో నెట్టేసుకుంటున్నారు. సిగరెట్‌లో ఉండే రసాయనాలు రక్తాన్ని చిక్కగా చేస్తాయి. అలా చిక్కగా మారడం వలన సిరలు, దమనుల లోపలి గోడల్లో గడ్డలు ఏర్పడతాయి. సిరలు, ధమనుల్లో గడ్డకట్టి రక్త ప్రవాహాన్ని అడ్డుకోవడం వలన గుండెపోటు ప్రమాదం పెరుగుతోంది.

ఇవి పాటిస్తే మేలు..: గుండె జబ్బుల బారిన పడకుండా ఉండాలంటే జీవన శైలిని మార్చుకోవాలి. పనిలో ఒత్తిడి తగ్గించుకునే ప్రయత్నం చేయాలి. యోగా, ధ్యానం వంటి వాటి పై దృష్టి సారించాలి. శారీరక శ్రమ కలిగేలా రోజుకు కనీసం 30 నిమిషాల పాటు వాకింగ్, వ్యాయామం చేయాలి. తల్లిదండ్రులకు గుండె జబ్బులు ఉన్నవారు 30 ఏళ్లు దాటిన తర్వాత హార్డ్ చెకప్ తరచూ చేయించుకోవాలి. ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలి, ఫాస్ట్ ఫుడ్, నూనె ఎక్కువగా వినియోగించిన ఆహారం తీసుకోరాదు.

వయస్సుతో సంబంధం లేదు.. డాక్టర్ శ్రీనివాస్, గుండె సంబంధిత వ్యాధి నిపుణులు: వయస్సుతో సంబంధం లేకుండా గుండెపోటు వస్తోంది. మారుతున్న ఆహారపు అలవాట్లు, జీవనశైలి, కంటి నిండా నిద్రలేకపోవడం వంటివే హార్ట్ ఎటాక్‌కు కారణం.


# తెలంగాణలో తగ్గిన రిజిస్ట్రేషన్లు



హైదరాబాద్,తెలంగాణ దిశ: తెలంగాణ ప్రభుత్వం రియల్ ఎస్టేట్ రంగాన్ని ఆదుకోవడానికి మార్కెట్ విలువల పెంపును నిలిపివేసినా, ఆ రంగం ఇంకా గడ్డు పరిస్థితుల్లోనే ఉంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో (డిసెంబర్ వరకు) గత ఏడాదితో పోలిస్తే రిజిస్ట్రేషన్ల సంఖ్య సుమారు 50,000 తగ్గింది. గత ఏడాది 13లక్షల డాక్యుమెంట్లు నమోదు కాగా... ఈసారి 12.50 లక్షలకే పరిమితమయ్యాయి. అయితే... రిజిస్ట్రేషన్లు తగ్గినా ఆదాయం రూ. 11,100 కోట్లకు పెరగడం విశేషం. హోమ్ లోన్ల కోసం రైతులు ఆస్తి విలువను ఎక్కువగా చూపడమే దీనికి కారణం. అయినప్పటికీ, ప్రభుత్వం నిర్దేశించుకున్న రూ. 19,100 కోట్ల వార్షిక ఆదాయ లక్ష్యాన్ని చేరుకోవడం ప్రస్తుతం అధికారులకు పెద్ద సవాలుగా మారింది. తెలంగాణ ప్రభుత్వం రియల్ ఎస్టేట్ రంగాన్ని తిరిగి బలోపేతం చేసేందుకు మార్కెట్ విలువల సవరణను తాత్కాలికంగా నిలిపివేయడం.. బిల్డర్లలో మనోధైర్యాన్ని నింపేలా సానుకూల నిర్ణయాలు తీసుకోవడం వంటి అనేక చర్యలు చేపట్టింది. అయినప్పటికీ.. రాష్ట్రంలో రియల్ ఎస్టేట్ రంగం ఇంకా సంక్షోభం నుండి పూర్తిగా బయటపడలేదని రిజిస్ట్రేషన్స్ అండ్ స్టాంప్స్ డిపార్ట్ మెంట్ తాజా గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.ప్రస్తుత 2025 -26 ఆర్థిక సంవత్సరంలో (డిసెంబర్ వరకు) ఆస్తుల రిజిస్ట్రేషన్ల సంఖ్య ఆందోళనకరంగా తగ్గింది. గత ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది సుమారు 50,000 రిజిస్ట్రేషన్స్ తక్కువగా నమోదయ్యా యి. గత ఏడాది డిసెంబర్ నాటికి 13 లక్షల డాక్యుమెంట్లు నమోదు కాగా.. ఈసారి ఆ సంఖ్య 12.50 లక్షలకు పడిపోయింది. ఇందులో నివాస, వాణిజ్య ప్రాంతాల రిజిస్ట్రేషన్లతో పాటు వివాహ నమోదులు, మ్యుటేషన్లు కూడా ఉన్నాయి.రిజిస్ట్రేషన్ల సంఖ్య తగ్గినప్పటికీ.. ప్రభుత్వానికి వచ్చే ఆదాయంలో స్వల్ప పెరుగుదల కనిపిస్తోంది. గత ఏడాదిఇదే సమయానికి రూ. 10,500 కోట్ల ఆదాయం రాగా.. ఈ ఏడాది రూ. 11,100 కోట్లు సమకూరాయి. అయితే.. ప్రభుత్వం నిర్దేశించుకున్న రూ. 19,100 కోట్ల భారీ ఆదాయ లక్ష్యాన్ని చేరుకోవడం ఇప్పుడు క్లిష్టంగా మారింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ మొత్తం రూ. 14,230 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. ప్రస్తుత లక్ష్యాన్ని చేరుకోవాలంటే మిగిలిన మూడు నెలల్లో సుమారు రూ. 7,800 కోట్లు వసూలు చేయాల్సి ఉంటుంది.. ఇది దాదాపు అసాధ్యమని అధికారులు భావిస్తున్నారు.

మాత్రమే రిజిస్ట్రేషన్లు ఆశాజనకంగా సాగాయి. మిగిలిన నెలల్లో వృద్ధి మందగించిందని సర్వేలు చెబుతున్నాయి. ముఖ్యంగా డిసెంబర్ నెలను 'పేలవమైన పనితీరు' ఉన్న నెలగా అధికారులు పేర్కొన్నారు. గత ఏడాది డిసెంబర్‌లో 1.15 లక్షల రిజిస్ట్రేషన్లు జరగ్గా.. ఈ ఏడాది కేవలం 1లక్ష మాత్రమే నమోదయ్యాయి. దీనికి భిన్నంగా జూలై 2024లో 2 లక్షల రిజిస్ట్రేషన్లు జరగ్గా.. జూలై 2025లో అవి 1.65 లక్షలకు తగ్గిపోయాయి.అమ్మకాలు తగ్గినా ఆదాయం పెరగడానికి ప్రధానంగా రెండు కారణాలు కనిపిస్తున్నాయి. ఒకటి.. ప్రస్తుతం కొనుగోలుదారులు ఎక్కువగా బ్యాంకు రుణాల పై ఆధారపడుతున్నారు. ఎక్కువ లోన్ పొందడం కోసం ఆస్తి విలువను ఎక్కువగా చూపిస్తూ రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. మరో కారణం ఏంటంటే.. హైదరాబాద్ ,దాని చుట్టుపక్కల జిల్లాల్లో భూముల ధరలు విపరీతంగా పెరగడం వల్ల.. ప్రజలు తప్పనిసరి పరిస్థితుల్లో ఎక్కువ విలువకే రిజిస్ట్రేషన్లు చేయాల్సి వస్తోంది. ప్రస్తుత మార్కెట్ పరిస్థితుల్లో గత ఏడాది కంటే 20 శాతం అదనపు ఆదాయం వచ్చినా అది పెద్ద విజయమేనని అధికారులు అభిప్రాయపడుతున్నారు.

# చెన్నమనేని రమేష్‌కు పెన్షన్ ఎలా ఇస్తారు?





**కరీంనగర్,తెలంగాణ దిశ:** బీఆర్ఎస్ నేత, వేములవాడ మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేష్ పౌరసత్వ వివాదం మరోమారు తెరపైకి వచ్చింది. భారత పౌరుడు కాదని హైకోర్టు తీర్పునిచ్చినప్పటికీ.. ఆయన మాజీ ఎమ్మెల్యే కోటాలో పెన్షన్ పొందడం వివాదాస్పదమైంది. కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఈ విషయంపై స్పందిస్తూ.. వెంటనే పెన్షన్ నిలిపివేయాలని గతంలో పొందిన ప్రయోజనాలను వెనక్కి తీసుకోవాలని అసెంబ్లీ సెక్రటరీని కోరారు.బీఆర్ఎస్ నేత చెన్నమనేని రమేష్ పౌరసత్వ వివాదం మరోసారి తెరపైకి వచ్చింది. ఆయన భారత పౌరుడు కాదని, ఎన్నికల్లో పోటీ చేసే సమయంలో జర్మనీ పౌరసత్వాన్ని దాచిపెట్టి మోసానికి పాల్పడ్డారని గతంలోనే హైకోర్టు తీర్పునిచ్చిన సంగతి తెలిసిందే. కోర్టు ఆయనకు రూ.30 లక్షల జరిమానా కూడా విధించింది. అయితే పౌరసత్వం లేదని తేలినప్పటికీ.. రమేష్ ఇప్పటికీ తెలంగాణ అసెంబ్లీ నుంచి నెలకు సుమారు రూ.60 వేలు మాజీ ఎమ్మెల్యే కోటాలో పెన్షన్‌ను పొందుతుండటం ఇప్పుడు వివాదాస్పదంగా మారింది. వేములవాడ కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఈ అంశంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. చెన్నమనేని రమేష్‌కు పెన్షన్ చెల్లింపులను వెంటనే నిలిపివేయాలని ఆయన అసెంబ్లీ సెక్రటరీని కోరారు. ఒక విదేశీయుడికి భారత ప్రభుత్వ నిధుల నుంచి పెన్షన్ ప్రయోజనాలు ఎలా కల్పిస్తారని ఆయన ప్రశ్నించారు. గతంలో ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో రమేష్ పొందిన జీతభత్యాలు, ఇతర ప్రభుత్వ ప్రయోజనాలను కూడా వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. 2024 డిసెంబర్‌లో హైకోర్టు ఇచ్చిన తీర్పును గుర్తు చేస్తూ..వాస్తవాలను దాచిపెట్టి రమేష్ మోసానికి పాల్పడ్డారని శ్రీనివాస్ ఆరోపించారు.అసెంబ్లీ నిబంధనల ప్రకారం మాజీ ఎమ్మెల్యేలకు పెన్షన్, వైద్య ఖర్చులు వంటి సౌకర్యాలు ఉంటాయి. రమేష్ వేములవాడ నుంచి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికైనందున.. 2023 డిసెంబర్ నుంచి ఆయనకు భారీగా పెన్షన్ అందుతోంది. దీనిపై ఆది శ్రీనివాస్ స్పందిస్తూ.. 'కోర్టు ఆదేశాల మేరకు ఆయన ఇప్పటికే రూ.30 లక్షల జరిమానా చెల్లించారు. అంటే ఆయన తప్పు చేశారని నిరూపితమైంది. అలాంటి వ్యక్తికి పెన్షన్ ఇవ్వడం ఏమాత్రం సమంజసం కాదు' అని వ్యాఖ్యానించారు. ఒకవేళ అసెంబ్లీ స్పీకర్ లేదా సెక్రటరీ దీనిపై తగిన చర్యలు తీసుకోకపోతే.. తాను మళ్లీ హైకోర్టును ఆశ్రయిస్తానని ఆది శ్రీనివాస్ హెచ్చరించారు.మరోవైపు.. ఈ వ్యవహారంపై న్యాయ నిపుణులు భిన్నమైన అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు. రమేష్ భారత పౌరుడు కాదన్నది వాస్తవమని అయితే పెన్షన్ నిలిపివేత లేదా రికవరీపై నిర్ణయం తీసుకునే అధికారం కేవలం లెజిస్లేటివ్ సెక్రటరీకి ఉందదని మాజీ అడ్వొకేట్ జనరల్ కె. రామకృష్ణ రెడ్డి వెల్లడించారు. అసెంబ్లీ స్పీకర్ మాత్రమే దీనిపై తుది నిర్ణయం తీసుకోగలరని చెప్పారు. బాధితులు కోర్టు ద్వారా ఉత్తర్వులు పొందాల్సి ఉంటుందని అభిప్రాయపడ్డారు. కోర్టు తీర్పులో జీతభత్యాల రికవరీ గురించి గానీ, పెన్షన్ గురించి గానీ ఎక్కడా ప్రస్తావించలేదని, అందుకే ఆయనకు పెన్షన్ పొందే హక్కు ఉందని రమేష్ వర్గీయులు వాదిస్తున్నారు. కాగా, ప్రభుత్వం, అసెంబ్లీ స్పీకర్ ఈ అంశంపై ఎలాంటి నిర్ణయం తీసుకుంటారనేది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.

## మార్కెట్ ను ముంచెత్తుతున్న..

# నకిలీలలు

**మహబూబ్ నగర్,తెలంగాణ దిశ :** మార్కెట్లో కల్తీ వంట నూనె విక్రయాలు జోరుగా కొనసాగుతున్నాయి. ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని అత్యుత్తమ బ్రాండ్ల పేరుతో మార్కెట్లోకి వస్తున్న వంట నూనెలను ప్రజలు వినియోగిస్తూ అస్వస్థతను కొనితెచ్చుకుం టున్నారు. సాధారణ పప్పులు, ఇతర పదార్థాలతో పాటు వంట నూనెలను కూడా కల్తీ చేస్తున్నారు. గజ్వేల్ ప్రాంతంలో ఏళ్ల తరబడిగా ప్రముఖ బ్రాండ్లకు చెందిన వంట నూనెలను కల్తీ చేస్తూ వ్యాపారులు ప్రజల ఆరోగ్యంతో చెలగాటమాడుతున్నారు. అధిక లాభాలను ఆర్జించడానికి నూనెలలో ఇతర నూనెలు పదార్థాలు కలుపుతూ కల్తీ చేయడమే కాకుండా ప్రముఖ కంపెనీల కవర్లను ముద్రించి వాటి ద్వారా కల్తీ వంట నూనెలను విక్రయిస్తున్నారు.ముఖ్యంగా ఓ ప్రముఖ కంపెనీ పేరుతో ప్రచారంలో ఉన్న పొద్దు తిరుగుడు విత్తనాలతో తయారు చేసిన వంట నూనెలను పత్తి గింజల నూనెతో కలిపి విక్రయిస్తున్నారు. ఈ కల్తీ నూనెను సాధారణంగా వంటలకు విక్రయించిన సమయంలో ఎలాంటి తేడా కనిపించడం లేదు. మాంసాహారం కానీ, తినుబండారాలు కానీ ఎక్కువగా వేయించిన ప్పుడు ఆ పదార్థాలు, నూనె కూడా పత్తి గింజల నూనె మాదిరిగా వాసన వస్తున్నాయి. కొనుగోలుదారులు కిరాణా దుకాణం యజమానులను అడిగిన సందర్భంలో డీలర్ ను సంప్రదించాలని సూచిస్తున్నారు.సంబంధిత డీలర్లు మాకు ఎలాంటి సంబంధం లేదంటూ, నూనె ప్యాకెట్లపై ఉండే కంపెనీ అడ్రస్ ను సంప్రదించాలని సూచిస్తూ చేతులెత్తేస్తున్నారు. సదరు కంపెనీ వంటనూనె పత్తి గింజల నూనె మాదిరిగా వాసన వస్తుందని డీలర్ ని వివరణ కోరగా పత్తి గింజల నూనె కలపడానికి ప్రభుత్వాలే అనుమతులు ఇస్తున్నట్లు వెల్లడించడం గమనార్హం. వంటనూనె ( పొద్దు తిరుగుడు గింజల నూనె) కల్తీ విషయంలో జిల్లా స్థాయి ఫుడ్ సేఫ్టీ అధికారులు అందుబాటులో లేకపోవడంతో పూర్వ అధికారులను సంప్రదించగా అసలు విషయం బయట పెట్టారు. వేర్వేరు గింజల నూనెను కలిపి వంట నూనెగా విక్రయించడానికి ప్రభుత్వం ఎలాంటి అనుమతులు ఇవ్వదని వారు వెల్లడించారు. ప్రతి వంటనూనె ప్యాకెట్లపై ఏయే పదార్థాలు వంట నూనె తయారీకి వినియోగిస్తారో వివరాలు రాసి ఉంటాయని చెప్పారు.అంటే డీలర్లు కూడా ఈ విషయంలో వాస్తవాలను దాచిపెడుతున్నట్లు అధికారుల మాటల ద్వారా తేటతెల్లం అవుతుంది. గజ్వేల్ ప్రాంత అధికారులతో పాటు, జిల్లా స్థాయి అధికారులు సైతం మామూళ్ల మత్తులో తనిఖీలు చేపట్టకపోవడంతో కల్తీ వంట నూనెను వినియోగిస్తూ ప్రజలు అనారోగ్యాన్ని కొని తెచ్చుకుంటున్నారు. ఇప్పటికైనా ఉన్నత స్థాయి అధికారులు స్పందించి ప్రముఖ కంపెనీ వంటనూనె కల్తీని అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

# 60 మార్కులకే ఇంటర్ మ్యాథ్స్..




**హైదరాబాద్,తెలంగాణ దిశ :**మన సమాజంలో చాలా మంది విద్యార్థులకు లెక్కల సబ్జెక్ట్ అంటేనే భయం. చదవకుండానే... అర్థం చేసుకోకుండానే ఫెయిల్ అవుతామని భయపడతారు. ప్రతి ఏటా పది, ఇంటర్ తరగతుల్లో ఎక్కువ మంది విద్యార్థులు ఫెయిల్ అవుతోంది కూడా మ్యాథ్స్ సబ్జెక్ట్‌లోనే. మ్యాథ్స్ పరీక్ష అంటేనే మరీ ముఖ్యంగా ఇంటర్ విద్యార్థులు భయంతో వణికిపోతుంటారు. ఈ పరిస్థితిలో మార్పు తెచ్చేందుకు తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు కీలక నిర్ణయం తీసుకుంది. దీని ప్రకారం వచ్చే సంవత్సరం నుంచి ఇంటర్ విద్యార్థుల కు కేవలం 60 మార్కులకే మ్యాథ్స్ పరీక్ష నిర్వహించబోతున్నారు. 2026-2027 విద్యా సంవత్సరం నుంచి ఇది అమలు కాబోతుంది. తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు... విద్యార్థులపై పరీక్షల ఒత్తిడి, భారాన్ని తగ్గించే దిశగా కీలక నిర్ణయం తీసుకుంది. మ్యాథమెటిక్స్ పరీక్షా సిలబస్, విధానంలోనూ విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది. ఇప్పటి వరకు మ్యాథ్స్ పేపర్ అంటే 75 మార్కులకు రాత పరీక్ష ఉంది. వచ్చే ఏడాది నుంచి ఈ విధానం మారనుంది. మ్యాథ్స్ పరీక్ష కోసం... సీబీఎస్ఈ (అబాఇ) మాదిరి మన దగ్గర కూడా ఇంటర్నల్ మార్కుల విధానాన్ని తీసుకురావాలని బోర్డు నిర్ణయించింది.ప్రస్తుతం ఇంటర్‌లో మ్యాథ్స్?ఏ, మ్యాథ్స్?బీ రెండు పేపర్లకు చెరో 75మార్కుల చొప్పున మొత్తం 150 మార్కులకు ప రీక్ష నిర్వహిస్తున్నారు. అయితే వచ్చే విద్యా సంవత్సరం నుంచి మాత్రం తెలంగాణలో ఇంటర్ మ్యాథ్స్ పరీక్ష కేవలం 60 మార్కులకే జరగనుంది. ఇది కూడా థియరీ పార్ట్. మిగిలిన 15 మార్కులను 'ఇంటర్నల్స్'కు కేటాయించనున్నారు. విద్యార్థి సామర్థ్యం, ప్రాజెక్టులు, అటెండెన్స్ వంటి అంశాల ఆధారంగా ఇంటర్నల్స్‌లో ఈ 15 మార్కులు వేస్తారు.దీంతో విద్యార్థులపై పరీక్షల ఒత్తిడి కొంత తగ్గే అవకాశంఉంది. ఇప్పటివరకూ ఎంపీసీ,ఎంఈసీ విద్యార్థులకు మ్యాథ్స్ పేపర్ఒకేలా ఉంది. రెండు పేపర్లకు వచ్చే 150మార్కులను శాతంగా తీసుకొని వంద మార్కులకు కుదించారు. ఇకపై ఈ విధానానికి చెక్ పడనున్నది. ఎంఈసీ విద్యార్థులకు మ్యాథ్స్ పేపర్‌ను వంద మార్కులకు నిర్వహించనున్నారు. ఎంపీసీ, ఎంఈసీ విద్యార్థులకు వేర్వేరుగా ప్రశ్నపత్రాలు రూపొందించనున్నారు.అలానే ఇంటర్ పరీక్షల విధానంతో పాటు సిలబస్‌లో కూడా భారీ మార్పులు చేయబోతున్నారు. ప్రస్తుతం ఎక్కువ మంది విద్యార్థులు... మ్యాథ్స్ బీలోనే ఫెయిల్ అవుతున్నారు. దీన్ని గమనించిన ఇంటర్ బోర్డు... మ్యాథ్స్ బీ పాఠ్య పుస్తకంలోని కొన్ని కఠినమైన చాప్టర్లను మ్యాథ్స్ ఏలోకి మార్చాలని డిసైడ్ అయింది. ఈ మార్పులన్నీ వచ్చే విద్యా సంవత్సరం (2026-27) నుంచే పక్కాగా అమలు కానున్నాయి.

# గట్టికల్లు గ్రామంలో బీఎన్ విగ్రహ ఏర్పాటుకు శంకుస్థాపన



**ఆత్మకూర్,తెలంగాణ దిశ:**సూర్యాపేట జిల్లా ఆత్మకూరు.ఎస్ మండలం గట్టికల్లు గ్రామంలో భీమిరెడ్డి నరసింహారెడ్డి విగ్రహ ఏర్పాటుకు సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంసీపీఐయూ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వరికుప్పల వెంకన్న, సూర్యాపేట జిల్లా కార్యదర్శి షేక్ నజీర్, గట్టికల్లు గ్రామ సర్పంచ్ భయ్యా లింగయ్య, ఉప సర్పంచ్ సందాల వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ మద్ది వెంకన్న, గుండు రమేశ్ మాట్లాడుతూ.. శ్రీరామ్ సాగర్ రెండవ దశ సాధన ప్రదాత, తెలంగాణ రైతాంగ పోరాట యోధుడు, ఎంసీపీఐ యూ పోలిట్ బ్యూరో సభ్యుడు, అమరజీవి కామ్రేడ్ భీమిరెడ్డి నరసింహారెడ్డి చిన్నతనంలోనే ఎర్రజెండా చేతబట్టి ప్రజా ఉద్యమాలకు ప్రాణం పోశారన్నారు. దొరల గడీల మీద యుద్ధం చేసి అట్టడుగు వర్గాలకు 10 లక్షల ఎకరాల భూమిని పంచిపెట్టిన ఘనత బీఎన్‌దేనని కొనియాడారు. ఆనాడు సాయుధ పోరాటంలో తుపాకి పట్టి ముందు కదిలితే శత్రువుల గుండెలు గుబిల్లు మన్నా యని, మోదుగు చెట్లకు బులెట్లు పూయించిన ఎర్రజెండా ముద్దుబిడ్డ భీమిరెడ్డి అన్నారు. వారి త్యాగం వృథా కాకుండా భావితరాలకు ఆదర్శంగా ఉండేందుకు బీఎన్ నిలువెత్తు విగ్రహాన్ని పోరాటాల పురిటిగడ్డ గట్టికల్లు గ్రామంలో నెలకొల్పుతున్నటలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు మోరపాక ఉగ్రయ్య, బచ్చు కోటయ్య, వార్డు మెంబర్లు మురపాక విష్ణు, బచ్చులకూరి సాయి, గ్రామ నాయకులు రాచకొండ సైదులు, మద్ది శ్రీను, అయోధ్య, చందాల నాగార్జున, పూలమ్మ పాల్గొన్నారు.

## గజగట్లపల్లి గ్రామంలో తీరిన నీటి సమస్య



**చిన్నశంకరంపేట,తెలంగాణ దిశ:** చిన్నశంకరంపేట మండలం గజగట్లపల్లి గ్రామంలో నీటి సమస్య తో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయాన్ని నూతన సర్పంచ్ బండారు నాగభూషణం ఆర్ బ్ల్యూఎస్ ఏఈ స్వప్న దృష్టికి తీసుకువెళ్లారు. గజగట్లపల్లి గ్రామానికి ఆర్డబ్ల్యూఎస్ ఏఈ స్వప్న వచ్చి నీటి సమస్యపై గ్రామంలో తిరిగి చూసి సమస్య ఉన్నచోట ఇక్కడ ట్యాంకులకు వాటర్ పంపు చేసి అందరికీ వచ్చేలా చేశారు. దీంతో గ్రామంలో నీటి సమస్య తీరుతుందని గ్రామ సర్పంచ్ బండారు నాగభూషణం తెలిపారు. తనను ఎన్నుకున్న గ్రామ ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలుపుతూ, గ్రామంలోని సమస్యలను ఒక్కొక్కటి చొప్పున తీరుస్తారని తెలిపారు.

# మందు బాబులకు రైతు షాక్..!

**మెదక్,తెలంగాణ దిశ :** మెదక్ జిల్లా రైతు ఆనంద్ తన మామిడి తోటను 'మందు బాబుల' బారి నుంచి కాపాడుకోవడానికి సంచలన నిర్ణయం తీసుకున్నారు. తోటలో మద్యం తాగితే 25 చెప్పుదెబ్బలు, రూ. 5,000 జరిమానా విధిస్తామని హెచ్చరిస్తూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈ వినూత్న హెచ్చరిక సోషల్ మీడియాలో వైరల్ అయింది. సాధారణంగా తోటల్లోకి పక్షులు, జంతువులు రాకుండా రైతులు కాపలా కాస్తారు. కానీ మెదక్ జిల్లా నర్సాపూర్ మండలం బ్రాహ్మణపల్లికి చెందిన రైతు ఆనంద్ మాత్రం 'మందుబాబుల' బారి నుంచి తన మామిడి తోటను కాపాడుకోవడానికి ఒక సంచలన నిర్ణయం తీసుకున్నారు. తన తోటను మద్యం తాగే స్థావరంగా మార్చుకున్న వారిని హెచ్చరిస్తూ ఆయన ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ ఇప్పుడు అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఆనంద్‌కు నర్సాపూర్ ప్రధాన రహదారి పక్కనే మామిడితోట ఉంది. నర్సాపూర్ పట్టణంలో మద్యం కొనుగోలు చేసే కొందరు వ్యక్తులు, దారిపక్కనే ఉన్న ఈతోటను తమ 'బార్'గా మార్చు కున్నారు. చెట్ల నీడన కూర్చుని హాయిగా మద్యం సేవించడమే కాకుం డా, వెళ్లేటప్పుడు ఖాళీ సీసాలను తోటలోనే పగలగొట్టి వెళుతున్నారు. అలాగే తిన్న పదార్థాల వ్యర్థాలను డిస్పోజబుల్ ప్లేట్లు, గ్లాసులు తోట నిండా పడేసి అపరిశుభ్రం చేస్తున్నారు.మందుబాబులు పగలగొట్టిన గాజు ముక్కల వల్ల తోటలో పనిచేసే కూలీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పిందెలు చూడటానికి, నీళ్లు పెట్టడానికి వెళ్లే కూలీల కాళ్లకు ఈ సీసా పెంకులు గుచ్చుకుని పలుమార్లు రక్తగాయాలయ్యా యి. ఎన్నిసార్లు చెప్పినా, బతిమిలాడినా మందుబాబుల ప్రవర్తనలో మార్పు రాకపోవడంతో ఆనంద్ విసిగిపోయారు. శాంతితో చెప్పినప్పుడు వినని వారికి 'సామ దాన భేద దండోపాయాలు' వాడాలని నిర్ణయించుకున్న ఆనంద్.. తన తోట చుట్టూ భారీ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. అందులో ఆయన రాసిన మాటలు చూసి మందుబాబుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.'ఇక్కడ మామిడి చెట్లలో మద్యం తాగరాదు. తాగినచో వారికి 25 చెప్పుదెబ్బలు.. అలాగే రూ. 5,000 జరిమానా విధించబడును' అని ఆ బ్యానర్‌లో స్పష్టంగా హెచ్చరించారు. ఈ వినూత్న హెచ్చరికను చూసిన స్థానికులు దాన్ని ఫోటో తీసి సోషల్ మీడియాలో పెట్టడంతో అది కాస్తా వైరల్ అయ్యింది. నెటిజన్లు ఈ రైతు ధైర్యాన్ని అభినందిస్తున్నారు. అన్నదాత ఆవేదనను అర్థం చేసుకోవాలి.. తోటలు పార్టీలకు వేదికలు కావు అంటూ పలువురు కామెంట్లు పెడుతున్నారు. మరి ఈ ఘాటు హెచ్చరిక తర్వాతైనా మందుబాబులు తమ పద్ధతి మార్చుకుంటారో లేదో వేచి చూడాలి

## గ్రామాలలో పారిశుధ్య చర్యలు చేపట్టాలి : ఎంపీడీవో శ్రీనివాస్ వర్మ

**జగదేవపూర్,తెలంగాణ దిశ :**గ్రామాలలో పారిశుధ్య చర్యలు చేపట్టాలని ఎంపీడీవో శ్రీనివాస్ వర్మ పేర్కొన్నారు. జగదేవపూర్ మండలం తిగుల్ లో పర్యటించారు. గ్రామపంచాయతీ ఆవరణలో ఉన్న నర్సరీని సర్పంచ్ రజితతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో ఎక్కడ పిచ్చి మొక్కలు చెత్త చెదారం లేకుండా పారిశుధ్య నిర్మూలన చర్యలు వేగవంతం చేయాలని సూచించారు. నర్సరీలో నూతన మొక్కల పెంపకం, నర్సరీ పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని కోరారు.

ఉపాధి హామీ పథకం ద్వారా వివిధ అభివృద్ధి పనులను ప్రజలు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని వివరించారు. ఎంపీడీవో శ్రీనివాస్ వర్మకు సర్పంచ్ రజిత, ఉపసర్పంచ్ శ్రీనివాస్ రెడ్డిలు శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో ఏఎంసి మాజీ వైస్ చైర్మన్ సుధాకర్ రెడ్డి, పిఎసిఎస్ డైరెక్టర్ భూమయ్య, మాజీ సర్పంచ్ ఎల్లయ్య, స్థానిక నాయకులు అశోక్, ఎల్లారెడ్డి, మహేందర్ రెడ్డి, కార్యదర్శి నరేందర్ పాల్గొన్నారు.





# కిలోమీటర్ ప్రయాణానికి అరగంట..

# రద్దీ నియంత్రణపై పోలీసు శాఖ కసరత్తు

**హైదరాబాద్,తెలంగాణ దిశ :** నగరంలో ప్రయాణమంటే నరకంగా మారింది. కిలోమీటర్ ప్రయాణానికి అరగంట సమయం పడుతున్న సందర్భాలు కోకొల్లాలు. వర్షం పడినా, రహదారులపై వాహనాలు మరమ్మతులకు గురైనా పరిస్థితి చెప్పనవసరం లేదు. సిటీలో వాహనాల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నదని సీపీ సజ్జనార్ ఓ సమావేశంలో ప్రకటించారు. ట్రాఫికర్‌ను తొలగించడానికి సజ్జనార్ అన్ని విభాగాలతో సమన్వయ సమావేశం నిర్వహించి ట్రాఫిక్ నియంత్రణపై చర్చించారు. ఈ సమావేశంలో సికింద్రాబాద్, చాదర్‌ఘాట్, మలక్‌పేట, పాతబస్తీ తదితర ప్రాంతాలన్నీ ట్రాఫిక్ రద్దీతో స్థానికులతో పాటు ఆప్రాంతాలకు వెళ్లేవారికి ఇబ్బందులు తప్పడం లేదు. ట్రాఫిక్ రద్దీ నియంత్రించడానికి పోలీసుశాఖ జీహెచ్‌ఎంసీకి కొన్ని ప్రతిపాదనలు పంపింది. పోలీసులు పంపిన అనేక ప్రతిపాదనలు కార్యరూపం దాల్చలేదనే విషయం ఈ సమావేశంలో వెలుగులోకి వచ్చింది. భాగ్యనగరంలో నిజాం నవాబుల కాలంలో రూపొందిన సీతారాంబాగ్, కిషన్‌బాగ్, కంచన్‌బాగ్ తదితర బాగ్, మలక్‌పేట, ధూల్‌పేట తదితర పేటలు, చాంద్రాయణగుట్ట తదితర గుట్టల రూపంలో ఏర్పడిన ప్రాంతాలే అత్యధికంగా ఉన్నాయి. ఈ ప్రాంతాల కారణంగానే అవసరమైన స్థాయిలో రోడ్లు, సమాంతర మార్గాలు లేకపోవడంతో ట్రాఫిక్ కష్టాలు తీరడం లేదు.

పోలీసుల ప్రతిపాదనలివే..: జనరల్ బజార్ నుంచి వెళ్లే రద్దీ ప్రభావం సర్దార్‌పటేల్ రోడ్డు, మహాత్మాగాంధీ రోడ్లపై పడకుండా ఉండేందుకు హైదర్‌బస్తీ నుంచి నెక్లెస్‌రోడ్డు మీదుగా బేగంపేటకు మార్గం అభివృద్ధి చేయాలని ప్రతిపాదించారు. దీనివల్ల రాష్ట్రపతిరోడ్డు, మహాత్మాగాంధీరోడ్లతో పాటు ప్యాట్నీ, ప్యారడైజ్ ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో ట్రాఫిక్ రద్దీ తగ్గి వాహనాలు సజావుగా ముందుకు వెళ్తాయి. రంగ్‌మహల్ నుంచి ఎంజీబీఎస్ వరకు మూసీ మీదుగా వంతెన నిర్మాణం చేపట్టాలని దీంతో సెలవుదినాలు, పండుగల సమయంలో ఆర్టీసీ, స్పెషల్ బస్సుల రద్దీతో ఇటు అఫ్జల్ గంజ్ నుంచి అటు చాదర్‌ఘాట్ వరకు రాత్రివేళల్లో ట్రాఫిక్ జామ్‌ల నిరోధానికి ఉపయోగపడుతుందని, రంగమహల్ చౌరస్తా కేంద్రంగా చాదర్‌ఘాట్, మెడికల్ కాలేజీ, ఇమ్లిబన్ మార్గాలన్నీ రద్దీ తగ్గుతాయని ప్రతిపాదించారు.

హైదరాబాద్, సికింద్రాబాద్‌లను కలిపే ట్యాంక్‌బండ్ మార్గం నిత్యం రద్దీగా ఉంటుంది. సయిదానిమా సమాధి వెనుక నుంచి నాలాపై బ్రిడ్జి నిర్మాణం చేపడితే ట్యాంక్‌బండ్ నుంచి రాణిగంజ్ వరకు మార్గం ఇరువైపులా రద్దీ తగ్గుతుందని పోలీసులు సూచించారు. సికింద్రాబాద్ ప్రాంతంలో ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండడం వల్ల పార్కింగ్‌కు తీవ్ర సమస్య ఉందని, ఈ నేపథ్యంలో మోండామార్కెట్‌ను తరలించాలని కోరారు. పాత గాంధీ ఆసుపత్రిని మరమ్మతులు చేయడంతో పాటు ఆర్టీసీ సెంట్రలైజ్డ్ డిపో ఏర్పాటు చేస్తే సికింద్రాబాద్‌లో ఉన్న వివిధ బస్‌స్టాప్‌ల కారణంగా ఏర్పడుతున్న రద్దీ తగ్గుతుందని, పార్కింగ్ సమస్యలు కూడా తీరుతాయని పోలీసు విభాగం జీహెచ్‌ఎంసీకి ప్రతిపాదనలు పంపింది. వీటితో పాటు మరో ప్రధాన సమస్యపై దృష్టిపెట్టాలని పోలీసులు సూచించారు. నగరంలోకి వస్తూ పోతున్న ప్రైవేటు బస్సులు ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్ చేస్తూ, వేగంగా వెళ్లడం ద్వారా ట్రాఫిక్ జామ్‌కు, ప్రమాదాలకు కారణమవుతున్నాయని, నగరం వెలుపల కొన్ని పాయింట్లను గుర్తించి అక్కడ ప్రైవేటు బస్సుల కోసం స్టాప్స్ నిర్మిస్తే బాగుంటుందని, దీనివల్ల చాలా సమస్య తీరుతుందని హైదరాబాద్ పోలీసులు సూచించారు.

పునర్వ్యవస్థీకరణతో నియంత్రించేనా?:

జీహెచ్‌ఎంసీ పునర్వ్యవస్థీకరణ తో పాటు పోలీసు కమిషనరేట్ల విభజన కూడా జరిగి నగరం నాలుగుకమిషనరేట్లుగా రూపాంతరం చెందింది. హైదరాబాద్ అతిపెద్ద కమిషనరేట్‌గా రూపొందగా సిటీ సెంట్రల్‌లోకి నగరం చుట్టుపక్కల నుంచి వచ్చే వాహనాలతో ఎప్పుడూ రద్దీగా ఉంటుంది.

అయితే ఇతర కమిషనరేట్ల సమన్వయంతో ఈ రద్దీని నియంత్రించి నగరంలో ట్రాఫిక్ సమస్యలు తొలగించే ప్రయత్నం చేస్తున్నట్లు పోలీసులు చెబుతున్నా.. ప్రస్తుతం ఈ విభజన ఒక కొలిక్కి రావడానికి ఎంత కాలం పడుతుందో తెలియదని వారంటున్నారు. సాంకేతికంగా ఉన్న అంశాలు పోలీసు కమిషనరేట్ల విభజనకు కొంత అడ్డంకిగా మారుతుండగా, జీహెచ్‌ఎంసీ ఎన్నికలు పూర్తయ్యేవరకు ఎలాంటి ప్రతిపాదనలు ముందుకుసాగవని చర్చ జరుగుతుంది. అంతే కాకుండా పోలీసులు పెట్టిన ప్రతిపాదనలు స్థానిక నాయకులకు కొంతమేరకు ఇబ్బంది కలిగించేవిగా ఉన్నాయని, పాతబస్తీలో ఈ సమస్య అధికంగా ఉందని ఓ పోలీసు ఉన్నతాధికారి చెప్పారు. ప్రస్తుతం నగరంలో ట్రాఫిక్ నియంత్రణపై చర్యలు తీసుకుంటున్నా పోలీసుల ప్రతిపాదనలు కార్యరూపం దాల్చితేనే ట్రాఫిక్ సమస్య తీరుతుందని ఆ అధికారి చెప్పారు.




# తమిళనాడులోకి సీబీఐ..!

చెన్నై:బీజేపీ వచ్చే ముందు సీబీఐ, ఐటీ, ఈడీ వస్తాయని కొంత మంది సెటైర్లు వేస్తూ ఉంటారు. తమిళనాడులో ఈడీ, ఐటీ చాలా కాలంగా ఉన్నాయి. తాజాగా సీబీఐ రంగంలోకి దిగింది. మిగతా రెండు డీఎంకే నేతల సంగతి చూసుకుంటే..సీబీఐ మాత్రం విజయ్ ను గురిపెట్టింది. కానీ అది రాజకీయ సమీకరణాల ఆధారంగానే ఉండనుంది.తమిళనాట రాజకీయ అరంగేట్రం చేసిన దళపతి విజయ్‌కు ఆదిలోనే భారీ సవాలు ఎదురవుతోంది. కరూర్ జిల్లాలో సెప్టెంబర్ 2025లో జరిగిన 'టీవీకే' బహిరంగ సభలో చోటుచేసుకున్న తొక్కిసలాట సంఘటనపై సీబీఐ తన విచారణను వేగవంతం చేసింది. ఈ దుర్ఘటనలో సుమారు 41 మంది మరణించడం దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ క్రమంలో ఇప్పటికే పార్టీ ముఖ్య నేతలను విచారించిన సీబీఐ, త్వరలోనే స్వయంగా విజయ్‌ను కూడా ప్రశ్నించే అవకాశం ఉందన్న వార్తలు తమిళనాట రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తున్నాయిగత ఏడాది సెప్టెంబర్ 27న కరూర్ జిల్లాలో విజయ్ నిర్వహించిన భారీ రాజకీయ ర్యాలీలో ఊహించిన దానికంటే ఎక్కువ మంది అభిమానులు తరలివచ్చారు. కేవలం 10 వేల మందికి అనుమతి తీసుకున్న సభకు దాదాపు 25 వేల మందికి పైగా రావడం, సరైన రక్షణ చర్యలు లేకపోవడం వల్లే ఈ భారీ తొక్కిసలాట జరిగిందని పోలీసుల ప్రాథమిక నివేదిక పేర్కొంది. అయితే, ఇది తమ పార్టీ ఎదుగుదలను ఓర్వలేక అధికార పక్షం చేసిన కుట్ర అని టీవీకే ఆరోపించింది. సుప్రీంకోర్టుకు వెళ్లింది. ఈ కేసును నిష్పక్షపాతంగా విచారించాలని సుప్రీంకోర్టు స్వయంగా సీబీఐకి అప్పగించిందిఈ కేసులో భాగంగా తాజాగా టీవీకే పార్టీ జనరల్ సెక్రటరీ బస్సీ ఆనంద్, జాయింట్ సెక్రటరీ నిర్మల్ కుమార్ , కరూర్ జిల్లా కార్యదర్శులను సీబీఐ ఢిల్లీలో మూడు రోజుల పాటు సుదీర్ఘంగా విచారించింది. సభ నిర్వహణలో వైఫల్యాలు,సీసీటీవీ ఫుటేజ్ , వాలంటీర్ల బాధ్యతపై అధికారులు ఆరా తీశారు. అధికారుల వద్ద ఉన్న సమాచారం ప్రకారం, సభకు విజయ్ రావడంలో జరిగిన జాప్యం వల్ల అభిమానులు అసహనానికి లోనై ముందుకు రావడమే ఈప్రమాదానికి ప్రధానకారణమని భావిస్తున్నా రు. విచారణ ముగింపు దశకు చేరుకున్న తరుణంలో, ఈవెంట్ ఆర్గనైజర్‌గా, పార్టీ అధ్యక్షుడిగావిజయ్ బాధ్యతనుకూడాసీబీఐ పరిశీలి స్తోంది. పార్టీ నేతల వాంగ్మూలాల ఆధారంగా విజయ్‌కు కూడా సమన్లు జారీ చేసే అవకాశం ఉందనే ఊహాగానాలు గట్టిగా వినిపిస్తు న్నాయి.

# సాగుదారులకు 'పీత' కష్టాలు !

## అందుబాటులోలేని సీడ్ ఆందోళనలో రైతులు

**కృష్ణా,తెలంగాణ దిశ :**వాతావరణ పరిస్థితుల్లో మార్పుల కారణంగా ప్రస్తుత సీజన్లో పీతల సాగు సమస్యగా మారింది. పీతల సాగుకు అవసరమైన సీడ్ హెచరీల్లో దొరకడం లేదు. దీంతో, సాగుదారులు మత్స్యశాఖ అధికారులను సంప్రదిస్తున్నారు. ఫిబ్రవరి వరకు సీడ్ అందించలేమని హెచరీలు చెప్తుండడంతో పీతల పెంపకందారులు ఆందోళన చెందుతున్నారు. రొయ్యల పెంపకం గిట్టుబాటు కావడం లేదు. ఎకరం విస్తీర్ణంలో రొయ్యల సాగుకు రూ.5.50 లక్షల వరకు వ్యయం అవుతోంది. ఇంత ఖర్చుపెట్టినా వ్యాధులు సోకిన సందర్భాల్లో పెట్టుబడి కూడా రాకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దీంతో, తీరప్రాంతంలోని కొందరు రైతులు పీతల సాగువైపు మొగ్గుచూపుతున్నారు. చెరువుల్లో పెంచే పీతలను ఎక్కువగా విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. సముద్రతీర ప్రాంతాలు పీతల పెంపకానికి అనుకూలం. నాలుగు నెలల కాలానికి పీతల పెంపకానికి ఎకరాకు రూ.1.75 లక్షల వరకు వ్యయం అవుతోంది. మార్కెట్లో కిలో సైజ్ పీత ధర రూ.1,000, అరకిలో సైజు పీత రూ.750కు వ్యాపారులు కొనుగోలు చేసి ఎగుమతి చేస్తున్నారు. రొయ్యలతో పోలిస్తే వీటికి వ్యాధులు తక్కువ.

ఎకరాకు రూ.3.50 లక్షల వరకు ఆదాయం వస్తోంది. కృష్ణా జిల్లాలో అత్యధికంగా ఐదు వేల ఎకరాల్లో, పశ్చిమ గోదావరిలో 2,500, తూర్పు గోదావరిలో 1,900, గుంటూరులో 1,000, ప్రకాశం 750, నెల్లూరు జిల్లాలో 500 ఎకరాల చొప్పున మొత్తం 11,500 ఎకరాల్లో పీతలు సాగు చేస్తున్నారు. అనధికారికంగా రికార్డుల్లో లేని



సాగు ఎక్కువగా ఉంది. రెండు నుంచి ఐదు గ్రాముల బరువున్న పీతల సీడ్ మూడు వేల వరకు అవసరం. ఈ దశలో ఒక్కో పిల్ల రూ.20 నుంచి రూ.35 వరకు విక్రయిస్తారు. సి 5, సి 8 దశలో ఉన్న సీడ్ ఎకరాకు ఆరు వేల వరకు అవసరం. సీడ్ దొరక్కపోవడంతో సాగుదారులు మత్స్యశాఖ అధికారులను సంప్రదిస్తున్నా వారూ చేతులెత్తేస్తున్నారు. ప్రభుత్వ సీడ్‌పైనే రైతుల్లో గురి:

పాండిచ్చేరి రాష్ట్రం సిరికాయిలి తాలూకా తోడువాయి గ్రామంలో రాజీవ్‌గాంధీ సెంటర్ ఫర్ ఆక్వా కల్చర్‌లో ఉత్పత్తి అయ్యే సీడ్ సాగుకు రైతులు అత్యధిక ప్రాధాన్యత ఇస్తారు. ఇక్కడ నాణ్యమైన సీడ్ లభిస్తుందని మత్స్యశాఖ అధికారులు చెబుతున్నారు. ఈ సెంటర్లో డిసెంబర్ నుంచి రైతులకు సీడ్ అందుబాటులో ఉండేది. ఈ ఏడాది వాతావారణ పరిస్థితుల్లో మార్పుల కారణంగా సీడ్ అందుబాటులో లేదని చెప్పడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

# అడ్డంగా బుక్కైన ఎమ్మెల్యే

**తిరుపతి,తెలంగాణ దిశ :** తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి రాజకీయాల్లో కలకలం రేపిన జనసేన కార్యకర్త శ్రీనివాసులు అలియాస్ రాయుడు హత్య కేసు కీలక మలుపు తిరిగింది. ఏడాది కాలంగా మిస్టరీగా, రాజకీయ ఆరోపణల నడుమ సాగుతున్న ఈ కేసు విచారణలో చెన్నై పోలీసులు దూకుడు పెంచారు. ఈ హత్యతో సంబంధం ఉందన్న అనుమానాలు, మృతుడి వీడియో వాంగ్మూలం ఆధారంగా శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డిని విచారించేందుకు చెన్నై పోలీసులు సన్నాహాలు చేస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఇదే జరిగితే జిల్లా రాజకీయాల్లో పెను సంచలనం ఖాయంగా కనిపిస్తోంది.ఈ కేసులో ప్రాథమికంగా జనసేన మాజీ ఇన్‌ఛార్జి కోట వినుత, ఆమె భర్త కోట చంద్రబాబులను నిందితులుగా భావించినప్పటికీ, మృతుడు రాయుడు చనిపోవడానికి ముందు చిత్రీకరించిన ఒక వీడియో ఇప్పుడు విచారణను మరో మలుపు తిప్పింది. సుమారు 19.42 నిమిషాల నిడివి ఉన్న ఈ వీడియోలో రాయుడు సంచలన విషయాల ను వెల్లడించారు. తనను ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి ప్రలోభపెట్టారని, తన అనుచరుడు సుజిత్‌రెడ్డి ద్వారా సంప్రదింపులు జరిపారని రాయుడు ఆ వీడియోలో పేర్కొన్నట్లు సమాచారం. ముఖ్యంగా కోట దంపతులను రోడ్డు ప్రమాదంలో అంతమొందించాలని తనపై ఒత్తిడి తెచ్చినట్లు రాయుడు చెప్పడం గమనార్హం. ఈ వీడియోనే ఇప్పుడు ఎమ్మెల్యే మెడకు చుట్టుకునేలా కనిపిస్తోంది.గతంలో ఈ కేసులో అరెస్టయిన కోట వినుత, చంద్రబాబులు మొదటి నుంచి తాము నిర్దోషులమని వాదిస్తూనే ఉన్నారు. రాయుడు హత్యలో తమ ప్రమే యం లేదని, ఇదంతా రాజకీయ కుట్రలో భాగంగా తమను ఇరికించే ప్రయత్నమని వారు ఆరోపించారు. దీని వెనుక ఎమ్మెల్యే బొజ్జల హస్తం ఉందన్నది వారి ప్రధాన ఆరోపణ. ఇప్పుడు రాయుడి వీడియో బయటకు రావడం, అందులో బొజ్జల పేరు ప్రస్తావనకు రావడంతో కోట దంపతుల వాదనకు బలం చేకూరుతోంది. ఈ నేపథ్యంలోనే కోట దంపతుల వాంగ్మూలాన్ని, రాయుడి వీడియోను సాంకేతిక ఆధారంగా తీసుకుని చెన్నై పోలీసులు ఎమ్మెల్యేను విచారించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది.శ్రీకాళహస్తి మండలం బొక్కసంపాళెం గ్రామానికి చెందిన జనసేన క్రియాశీలక కార్యకర్త శ్రీనివాసులు అలియాస్ రాయుడు గతేడాది మృతి చెందారు. జులై 7న అదృశ్యమైన రాయుడి మృతదేహం మరుసటి రోజు చెన్నైలోని కూవం నదిలో తేలింది. అప్పట్లో ఈ ఘటన స్థానికంగా తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. కేసు నమోదు చేసిన చెన్నై పోలీసులు దర్యాప్తు చేపట్టి కోట వినుత దంపతులతో పాటు వారి అనుచరులు గోపి, కారు డ్రైవర్ షేక్ దాసన్, శివకుమార్‌లను అరెస్టు చేశారు. అయితే, ఇది కేవలం వ్యక్తిగత కక్షల వల్ల జరిగిన హత్య కాదని, దీని వెనుక పెద్ద రాజకీయ హస్తం ఉందన్న అనుమానా లు అప్పట్లోనే వ్యక్తమయ్యాయి.ఈ కేసులో ఇటీవల జనసేనకే చెందిన పేట చంద్రశేఖర్‌ను పోలీసులు విచారించారు. ఆయన నుంచి సేకరించిన సమాచారం, రాయుడి వీడియో, కోట దంపతుల ఆరోపణలన్నింటినీ క్రోడీకరించుకున్న చెన్నై పోలీసులు.. తదుపరి చర్యగా ఎమ్మెల్యే బొజ్జలకు సమన్లు జారీ చేసే అవకాశం ఉంది. అయితే, బొజ్జల సుధీర్‌రెడ్డి మాత్రం ఈ ఆరోపణలను గతంలోనే ఖండించారు. రాయుడి హత్యతో తనకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. కానీ, సాక్ష్యాధారాలు వేరేలా ఉండటంతో పోలీసుల చర్య ఎలా ఉండబోతోందన్నది ఆసక్తికరంగా మారింది.ఒక కార్యకర్త హత్య కేసులో ఏకంగా సిట్టింగ్ ఎమ్మెల్యే విచారణకు హాజరు కావాల్సి రావడం రాజకీయంగా ఆయనకు ఇబ్బందికర పరిణామమే. ఒకవేళ రాయుడు వీడియోలో పేర్కొన్నట్లుగా.. కోట దంపతుల హత్యకు కుట్ర జరిగిందని రుజువైతే, ఈ కేసు రాష్ట్ర రాజకీయాల్లోనే సంచలనం సృష్టిస్తుంది. ఇది కేవలం హత్య కేసుగానే కాకుండా, రాజకీయ ప్రత్యర్థులను అంతమొందించేందుకు జరిగిన కుట్రగా మారే అవకాశం ఉంది. రానున్న రోజుల్లో చెన్నై పోలీసుల విచారణలో ఇంకెన్ని కొత్త విషయాలు వెలుగులోకి వస్తాయో వేచి చూడాలి.

# ఫారిన్ టూరులో టీడీపీ నేతలు

**గుంటూరు,తెలంగాణ దిశ :**ఎంత పెద్దవారికైనా వారికంటూ ఒక కుటుంబం, జీవితం ఉంటుంది. అది కాదనలేని సత్యం కూడా. అయితే ప్రజా జీవితంలో ఉన్నవారు కుటుంబాలతో ఎక్కువ సమయం గడపలేరు. రాజకీయ పార్టీల అధినేతలు, ప్రభుత్వ అధినేతలు క్షణం తీరిక లేకుండా గడుపుతుంటారు. అటువంటివారు కుటుంబాలతో గడిపేది చాలా తక్కువ సమయం. అందుకే ఏడాదికి ఒకసారి.. ఆరు నెలలకు ఒకసారి కుటుంబాలతో ప్రశాంతంగా గడిపేందుకు విదేశాలకు వెళుతుంటారు. ఎందుకంటే రాష్ట్రంలో ఉన్న ఏదో ఒక కార్యక్రమం ఉండనే ఉంటుంది. అయితే తాజాగా ఏపీ సీఎం చంద్రబాబు కుటుంబ సమేతంగా విదేశాలకు వెళ్లారు. దానిపై రాజకీయ ప్రత్యర్థులు నెగిటివ్ ప్రచారం చేస్తున్నారు. అది ఒక తప్పుగా చిత్రీకరిస్తున్నారు. అయితే ఈ విషయంలో మీడియా అతిగా ప్రచారం చేస్తోంది. సోషల్ మీడియా అయితే లేనిపోని ప్రచారం చేస్తూ ఉంది.తెలుగు మీడియాలో ప్రాధాన్యతాంశాలు ఎప్పుడూ మారిపోతూ ఉంటాయి. ఒకసారి వారికి తప్పుగా అనిపిస్తు ంది.. మరోసారి అదే ఒప్పుగా అనిపిస్తుంది. చంద్రబాబు తన కుటుంబంతో కలిసి విదేశాలకు వెళ్లారు. అంతకుముందే లోకేష్ తన భార్య, కుమారుడితో కలిసి విదేశాలకు వెళ్లారు. ప్రైవేట్ కార్యక్రమాల పేరిట తన కార్యాలయం నుంచి ఒక షెడ్యూల్ ప్రకటన విడుదల చేశారు. సీఎం చంద్రబాబు, ఆయన భార్య భువనేశ్వరి తో కలిసి ఆలస్యంగా బయలుదేరి విదేశాలకు వెళ్లారు. ఇప్పుడు కూడా విదేశీ పర్యటన అంటూ క్లారిటీ ఇచ్చారు. సీఎంవో నుంచి ప్రకటన కూడా వచ్చింది. అయితే దీనిని రాజకీయం చేయాలని చూస్తోంది ఒక సెక్షన్ ఆఫ్ మీడియా. అందులో ఏం తప్పు ఉందని మరో సెక్షన్ ఆఫ్ మీడియా చెబుతుండడం విశేషం. అయితే గతంలో జగన్ సీఎంగా ఉన్నప్పుడు విదేశీ పర్యటనలకు వెళితే ఇదే మీడియా వ్యతిరేకించేది. అదే మీడియా మద్దతుగా ప్రచారం చేసేది. కానీ ఇప్పుడు రివర్స్ గా మారింది. ఎందుకంటే రాజకీయ ప్రాధాన్యత అంశాలు మారాయి కాబట్టి.ఏ రంగంలోనైనా బిజీగా ఉంటే వారు కొంత బడలిక తీర్చుకునేందుకు కుటుంబాలతో సహా పర్యటనలకు వెళుతుంటారు. కొంతమంది ఆలయాలను సందర్శిస్తారు. మరికొందరు పర్యాటక ప్రాంతాలకు వెళ్తారు. అలా వెళ్లిన క్రమంలో కొంత ప్రశాంతత లభిస్తుంది అన్నది వాస్తవం. ఈ రాష్ట్రానికి ముఖ్య మంత్రి అయితే కుటుంబంతో గడపకూడదా? ఈ రాష్ట్ర మంత్రి అయితే వ్యక్తిగత పర్యటనలకు వెళ్ళకూడదా? అలానే అన్నట్టు ఉంది మీడియా ప్రవర్తన. మీడియా హౌస్ లో పనిచేసేవారు, అధినేతలు వ్యక్తిగత పర్యటనలకు వెళ్ళరా? అనే ప్రశ్నకూడా వినిపిస్తుంది. దైనందిన జీవితంలో బిజీగా ఉండే ప్రతి ఒక్కరూ ప్రశాంతత కోసం వ్యక్తిగత పర్యటనలకు వెళ్లడం సహజం. దానిని భూతద్దంలో చూపడం మాత్రం అసహజం.

# సుగవాసిని కలసిన టిడిపి నేతలు

రాయచోటి: రాజంపేట పార్లమెంటు టిడిపి అధ్యక్షులు సుగువాస ప్రసాద్ బాబును శనివారం పలువురు పార్లమెంటు పరిధిలోని టిడిపి నేతలు కలసి శుభాకాంక్షలు తెలిపారు రాజంపేట పార్లమెంట్ నూతన టిడిపి అధ్యక్షులు సుగవాసి ప్రసాద్ బాబు కలిసి 2026 నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన రాజంపేట నియోజకవర్గ సీనియర్ టిడిపి నేతలు..సరైన సమయంలో సమర్థుడైన యువనేతకు పగ్గాలు ఇవ్వడం మంచి నిర్ణయం అని,అలాగే ప్రసాద్ బాబు అధ్యక్షులుగా రాజంపేట నియోజకవర్గ అధివృద్ధికి,అలాగే ఎన్నో ఏళ్లుగా పార్టీ జెండా మోస్తున్న నికార్సైన కార్యకర్తల శ్రేయస్సు కొరకు ప్రత్యేకమైన చర్యలు తీసుకోవాలని సీనియర్ నేతలు విజ్ఞప్తి చేసారు, రాజంపేట పార్లమెంట్ టిడిపి మాజీ ఉపాధ్యక్షులు పుత్తా రామచంద్రయ్య మరియు భగవాన్ రెడ్డి,ఒంటిమిట్ట మండల సీనియర్ టిడిపి నాయకుడు కిరణ్ కుమార్, నియోజకవర్గ టిడిపి అధికార ప్రతినిధి కడితం రామమోహన్ నాయుడు,సిద్దవటం మాజీ సింగల్ విండో అధ్యక్షులు సుధా మురళి ,మాధవరం కూటమి నాయకులు అవ్వారు రవిశంకర్,సుండుపల్లె మైనారిటీ నేత చాంద్ బాషా,టిడిపి నేత వేంకటాద్రి నాయుడు,వార్డ్ సభ్యులు సామల చెంగయ్య,సిద్దవటం టీడీపీ నాయకుడు పుత్తా శివానంద,తదితర కార్యకర్తలు కలిసి శాలువ కప్పి పూల బోకే అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేసారురాయచోటి పట్టణం గాలివీడు రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో బడిశెట్టి రవి గారి ముద్దుల తమ్ముడు బడిశెట్టి భరద్వాజ్ రాయల్(చిన్న) జన్మదిన వేడుకలను తన అభిమాన నాయకుడు,రాజంపేట పార్లమెంట్ టిడిపి అధ్యక్షులు టీటీడీ పాలకమండలి మాజీ సభ్యులు రాయచోటి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు సుగవాసి ప్రసాద్ బాబు సంక్షంలో కేక్ కట్ చేసి బడిశెట్టి భరద్వాజ్ రాయల్ (చిన్న) ప్రసాద్ బాబు కేక్ తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారురాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు సుగవాసి ప్రసాద్ బాబు మర్యాద పూర్వకంగా కలిసిన డాక్టర్‌హుస్సేని సాహెబ్. రాయచోటి పట్టణం గాలివీడు రోడ్డు లోని టిడిపి కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిసి అన్నమయ్య జిల్లా రాయచోటి జిల్లా కేంద్రం విషయం మరియు జిల్లా సమస్యల పైన చర్చించారు.రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు సుగవాసి ప్రసాద్ బాబు కలిసిన సుండుపల్లి మండలం రాచపల్లెకు చెందిన పటాన్ దర్బార్ భాయ్ వారి మిత్ర బృంద.ఇటీవల కువైట్లో శ్రీ సుగవాసి ప్రసాద్ బాబు అభినందన సభలో మదనపల్లి ఎమ్మెల్యే గౌరవ నీయులు శ్రీ షాజహాన్ బాషా ఆధ్వర్యంలో తెలుగుదేశం పార్టీలో చేరిన యువ నాయకులు పఠాన్ ఖాన్ భాయ్ గారి తమ్ముడు పఠాన్ దర్బార్ భాయ్ మిత్ర బృందం రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు సుగవాసి ప్రసాద్ బాబు శనివారం రోజు రాయచోటి పట్టణం గాలివీడు రోడ్డులోని టిడిపి కార్యాలయంలో కలిసి పూల మాల వేసి బోకే అందజేసి శాలువ కప్పి సత్కరించి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.

# పెరగనున్న సిగిరెట్ ధర..!



ముంబై: సిగరెట్ తాగే వారికి ఇది బ్యాడ్ న్యూస్ అని చెప్పాలి. ఇకపై సిగరెట్ తాగాలంటే ఆస్తులు అమ్ముకోవాల్సి వస్తుందేమో. లేదా సిగరెట్ తాగడం ఆపేయాలి. ఎందుకంటే సిగరెట్ ధరలు భారీగా పెరగనున్నాయని తెలుస్తోంది.ఎక్సైజ్ డ్యూటీ పెంచి సిగరెట్లను కొనలేనంత భారం చేయడానికి కేంద్రం సిద్ధమవుతోందట. అదే జరిగితే సిగరెట్ రేట్లు భగ్గుమనడం ఖాయం. అంటే.. ప్రస్తుతం 18 రూపాయలుగా ఉన్న ఒక్క సిగరెట్ ధర త్వరలో 72 రూపాయలకు పెరగొచ్చని అధికారులు చెబుతున్నారు. సిగరెట్ల వినియోగాన్ని తగ్గించడానికి తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలు ఇవ్వడం లేదట. దీంతో రేట్లు పెంచేందుకు సెంట్రల్ ఎక్సైజ్ (అమెండ్‌మెంట్) బిల్-2025లో కేంద్రం ప్రపోజల్స్ పెట్టింది.పార్లమెంటు.. కేంద్ర ఎక్సైజ్ (సవరణ) బిల్లు, 2025కు ఆమోదం తెలిపిన తర్వాత దేశంలో సిగరెట్ల ధరలు భారీగా పెరగనున్నాయి. ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి ప్రవేశపెట్టిన ఈ బిల్లు.. సిగరెట్లు, సిగార్ల నుండి హుక్కా, నమలబడే పొగాకు వరకు అనేక రకాల పొగాకు ఉత్పత్తులపై ఎక్సైజ్ సుంకాలను సవరిస్తుంది.ప్రస్తుతం సిగరెట్ల పొడవు, రకాన్ని బట్టి ప్రతి 1,000 సిగరెట్ల ప్యాక్ పై రూ. 200 నుండి రూ. 735 వరకు సుంకం విధించబడుతోంది. తాజా సవరణ ప్రకారం ఆ సుంకం 2వేల 700-11వేల రూపాయలకు పెరగనుంది. నమిలే పొగాకు(చీవింగ్ టొబాకో)పై సుంకాలు 25% నుండి 100%కి అంటే నాలుగు రెట్లు పెరుగుతాయి. హుక్కా పొగాకుపై సుంకాలు 25% నుండి 40%కి పెరుగుతాయి. ధూమపాన (స్మోకింగ్) మిశమాలపై సుంకాలు 60% నుండి 300%కి అంటే 5 రెట్లు పెరిగే అవకాశం ఉంది. ఓవరాల్ గా చూస్తే.. ప్రస్తుతం రూ. 18 ఉన్న సిగరెట్ ధర త్వరలోనే రూ. 72 వరకుచేరొచ్చని అధికారుల అంచనా.ఈ పెంపు ఆన్‌లైన్‌లో మిశ్రమ స్పందనలకు దారితీసింది. "నేను ధూమపానం చేసేవాడిని కాబట్టి, నేను ఈ నిర్ణయం ఇష్టపడుతున్నాను. నేను కూడా దీన్ని మానేయొచ్చు" అని ఒక రెడ్డిట్ యూజర్ కామెంట్ చేశాడు. "ధూమపానం చేసే వారు నిరాశకు గురవుతున్నారు. ఈ మార్పు మనలో చాలా మందిని ప్రభావితం చేయదు" అని మరో యూజర్ అన్నాడు.కొందరు దీన్ని ప్రభుత్వ అతిక్రమణగా భావించారు. "నేను ఈ 'బిగ్ బ్రదర్'విధానాన్ని ద్వేషిస్తున్నా" అనిఒక యూజర్ అన్నాడు. ఇంతలో, మరికొందరు "బీడీ పీనే కా టైమ్ ఆగయా హై", "మై తో ఢిల్లీ కి హవా మే జీ లేతా హు.. ఫ్రీ ఫ్రీ ఫ్రీ" అని స్పందించారు.

# పోలవరం జిల్లాలో పోలవరం మిస్



**ఏలూరు,తెలంగాణ దిశ :** మైసూరు బోండాలో మైసూరు ఉండదు" అన్న సామెతను గుర్తు చేసేలా ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ లో ఒక కొత్త చర్చ మొదలైంది. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న జిల్లాల పునర్విభజన నిర్ణయంతో "పోలవరం జిల్లాలో పోలవరం ఊరే లేకపోవడం ఎలా?" అనే ప్రశ్న ప్రజల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఈ నిర్ణయం జరిగిన మంత్రివర్గ సమావేశంలో అధికారికంగా ఆమోదం పొందడంతో రాజకీయంగా, పరిపాలనపరంగా విస్తృత చర్చకు దారితీసింది. మంత్రివర్గ సమావేశంలో మొత్తం 24 అంశాలపై చర్చ జరగగా, జిల్లాల పునర్విభజనపై మంత్రివర్గ ఉపసంఘం చేసిన సిఫార్సులను కేబినెట్ ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ నిర్ణయం మేరకు రాష్ట్రంలో రెండు కొత్త జిల్లాలు ఏర్పాటు చేయడంతో పాటు, ఇప్పటికే ఉన్న 26 జిల్లాల్లో 17 జిల్లాల్లో సరిహద్దులు, మండలాలు, డివిజన్లలో మార్పులు చేయనున్నారు. మిగిలిన 9 జిల్లాలు ఎలాంటి మార్పులు లేకుండా యథాతథంగా కొనసాగనున్నాయి.ఈ నిర్ణయాల్లో అన్నమ య్య జిల్లా ( కేంద్రం మార్పు ఒక అంశంగా నిలవగా, పోలవరం జిల్లాలో పోలవరం గ్రామం లేకపోవడం మరింత చర్చకు దారి తీసింది. దీనిపై రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ మీడియాతో మాట్లాడుతూ స్పష్టత ఇచ్చారు. గత 18 నెలలుగా రాష్ట్రంలో సుపరిపాలన అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఆయన చెప్పారు. ముఖ్యంగా గిరిజన ప్రాంతాలు, పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల అభివృద్ధి దృష్టిలో పెట్టుకుని రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లాను ఏర్పాటు చేసినట్లు వివరించారు.పోలవరం జిల్లా పేరు ఉన్నప్పటికీ పోలవరం గ్రామం ఏలూరు జిల్లాలోనే కొనసాగడంపై విలేకరులు ప్రశ్నించగా, మంత్రి ఆసక్తికర ఉదాహరణ ఇచ్చారు. ఎన్టీఆర్ స్వగ్రామం నిమ్మకూరు కృష్ణా జిల్లా లో ఉన్నప్పటికీ, విజయవాడకేంద్రంగా ఏర్పడిన జిల్లాకు ఎన్టీఆర్ పేరు పెట్టిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అదే తరహాలో నిర్వాసిత ప్రాంతాలు ఎక్కువగా ఉన్న ప్రాంతాన్ని కేంద్రంగా చేసుకుని జిల్లాకు పేరు పెట్టడం పరిపాలనా అవసరాల కోసమేనని వివరించారు. ప్రజల నుంచి వచ్చిన సూచనలు, ఫిర్యాదుల ఆధారంగా కొన్ని మండలాలు, డివిజన్లను మార్చామని మంత్రి తెలిపారు. గత ప్రభుత్వం సరైన ప్రణాళిక లేకుండా జిల్లాలను విభజించడం వల్లే ఇలాంటి సమస్యలు వచ్చాయని, ఆ లోపాలను ఇప్పుడు సరిదిద్దుతున్నామని ఆయన వ్యాఖ్యానించారు.

ఈ విషయంపై నాదెండ్ల మనోహర్ కూడా స్పందిస్తూ, అప్పట్లో పారదర్శకంగా విభజన జరిగి ఉంటే ఇలాంటి గందరగోళం ఉండేదే కాదన్నారు.జిల్లా కేంద్ర హోదా కోల్పోతున్న రాయచోటి పట్టణాన్ని మరింత అభివృద్ధి చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ( హామీ ఇచ్చినట్లు వెల్లడించారు. స్థానిక ఎమ్మెల్యే, మంత్రి మండిపల్లి రామప్రసాద్ కు ఈ నిర్ణయాలపై ముందుగానే వివరించామని తెలిపారు. మొత్తంగా ఈ మార్పులన్నీ రాజకీయ లాభాల కోసం కాకుండా, పరిపాలన సౌలభ్యం, ప్రజలకు మెరుగైన సేవల కోసమేనని ప్రభుత్వం స్పష్టం చేస్తోంది.

# పోలీసులకు ఐ బొమ్మ రవి చుక్కలు!


**హైదరాబాద్,తెలంగాణ దిశ :** తప్పు చేసి అడ్డంగా దొరికినా.. బొంకి బయటకు రావొచ్చనే ప్లాన్ వేశాడో, లేక ఆధారాలు లేకుండా వీళ్లేం చేస్తారని ఫిక్స్ అయ్యాడో.. మొత్తానికి ఐబొమ్మ రవి తాజాగా మాట్లాడుతున్న తీరు, బాడీ లాంగ్వేజ్ చూస్తున్నవాళ్లంతా షాక్ అవుతున్నారు. తప్పు చేసి పశ్చాత్తాపం కనిపిస్తుందని అంతా అనుకుంటే , తప్పే చేయకుండా మా ఓవర్ యాక్షన్ ఏంటన్నట్లుగా మీడియా ప్రశ్నలకు రివర్స్‌లో సమాధానాలిస్తున్నాడు ఐబొమ్మ కేసులో పోలీసు విచారణ ఎదుర్కొంటున్న నిందితుడు రవి.విచారణలో భాగంగా పోలీసులు ఏ ప్రశ్నలు అడిగినా తడుముకోకుండా సమాధానం చెబుతున్న ఐబొమ్మ రవి, అడిగిన ప్రశ్నలు మళ్లీ అడిగితే మాత్రం కళ్లు ఉరిమి చూస్తున్నాడట. పైరసీ గుట్టు బయటపడ్డాక , సినీ ప్రముఖులను సైతం ఈ కేసులో ఇరికించడానికి విశ్వప్రయత్నాలు చేసినట్లుగా తెలుస్తోంది. సైబర్ క్రైమ్ డీసీపి ఆధ్వర్యంలో 12రోజులపాటు నిందితుడు రవిని విచారించిన పోలీసులు , రవి ఇచ్చే సమాధానాలకు షాకవ్వాల్సి వస్తోందట. మాటలు మార్చి మార్చి మాట్లాడుతూ, చివరకు పరిచయం ఉన్న స్నేహితులు, బంధువులను సైతం మీరెవరు , ఇప్పుడే చూస్తున్నా అంటూ వింత సమాధానాలతో నట విశ్వరూపం చూపిస్తున్నాడట.ఐబొమ్మ వెబ్ సైట్ ద్వారా కోట్లాది రూపాయలు సంపాదించిన రవి, వెబ్ సైట్స్ పోటీ విపరీతంగా పెరగడంతో , వాటి నుండి తట్టుకునేందుకు పట్టుకోండి చూద్దామంటూ ఫేక్ పోస్టర్ ను క్రియేట్ చేసి, పోలీసులకు సవాలు విరిసినట్లుగా తెలుస్తోంది. సినీ రంగానికి చెందిన కొందరు ప్రముఖులు, బయటి వ్యక్తులతో కలిసి ఇదంతా చేస్తున్నారని నమ్మించే ప్రయత్నం చేసినట్లుగా విచారణలో వెలుగు చూసినట్లు సమాచారం. వీ ఆర్ ఇన్ఫో టెక్ పేరుతో ఐబొమ్మ, బప్పం టీవీలను వెబ్ సైట్ లను రిజిస్టర్ చేసినట్లు గుర్తించిన పోలీసులు ,ఇప్పటికే ఆయా కంపెనీలకు మెయిల్ పంపి అదనపు సమాచారం సేకరిస్తున్నారు. తాను పైరసీ సినిమాలు వెబ్ సైట్ లో పెట్టలేదని, కేవలం ఆయా డొమైన్లకు




సర్వీసు మాత్రమే ఇచ్చానంటూ తాజాగా కొత్త రాగం అందుకున్నాడుఐబొమ్మ రవి విచారణలో వ్యవహరిస్తున్న తీరుతో పోలీసులు సైతం ఆశ్చర్యపోతున్నాడు.

తనతో కలిసి రూమ్ లో ఉన్న స్నేహితులను సైతం గుర్తించడంలో వీర లెవల్ లో నటిస్తున్నాడు. రవి స్నేహితులైన అంజయ్య, ప్రహ్లాద్, కాళీ ప్రసాద్ కు మాయమాటలు చెప్పి ,వారి వద్ద ఆధార్ ,పాన్ కార్డులను తీసుకుని ,వాటిని మార్చి నకిలీ పత్రాలు సంపాదించడం, ఫోర్జరీ సంతకాలు చేయడం చేసేవాడు. ఇలా తన పేరు క్రైమ్ సీన్‌లో లేకుండా చేసేందుకు అవసరమైన అన్ని అడ్డదారులు తొక్కాడు. ప్రాణ స్నేహితుడైన ప్రహ్లాద్ ను పోలీసులు చూపిస్తే , ఇదే మొదటి సారి చూస్తున్నా, అతనెవరో నాకు తెలియదంటూ బుకాయిస్తున్నాడు. అంతేకాదు ఏకంగా పోలీసులకు సైతం తాను నేరం చేశాననే రుజువుందా, నడిపింది ఐబొమ్మ అనే ఆధారాలు ఉంటే చూపండి అంటూ అడ్డదిడ్డంగా వాదిస్తున్నాడట.

# కూటమిలో సమతూల్యం ఎలా




**విజయవాడ,తెలంగాణ దిశ :** క్యాలెండర్ మారిన ప్రతిసారి కొత్త ఏడాదిమీద ఆశలు, అంచనాలు సహజంగానే పెరుగుతాయి. 2025 ముగిసి 2026 ప్రారంభమవడంతో ఈ ఏడాదిలో ఏమి జరుగుతుంది, పరిస్థితులు ఎలా ఉంటాయి అనే ఉత్కంఠ అందరిలోనూ కనిపిస్తోంది. వ్యక్తిగత జీవితాలతో పాటు రాజకీయాలు, పరిపాలన, ఇతర రంగాలపై కూడా చర్చలు ఊపందుకుంటున్నాయి. ముఖ్యంగా ప్రజలతో నేరుగా ముడిపడి ఉన్న పాలన రంగం గురించి సామాన్యులు కూడా ఆసక్తిగా మాట్లాడుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్ విషయానికి వస్తే, 2025 ఏడాది కూటమి ప్రభుత్వానికి ఒక విజయవంతమైన పాలనా సంవత్సరంగా గడిచిందనే అభిప్రాయం రాజకీయ వర్గాల్లో ఉంది. ప్రభుత్వం ఏర్పడి ఇప్పటివరకు మిత్రపక్షాల మధ్య ఎలాంటి విభేదాలు బయటకు రాకుండా, అందరూ కలిసికట్టుగా ముందుకు సాగుతున్నారని అంటున్నారు. కూటమిలో ఐక్యత కొనసాగడం వల్ల పరిపాలన సజావుగా నడిచిందన్న భావన కూడా బలంగా ఉంది.అయితే 2025లో కూటమి ప్రభుత్వంపై అనేక ఊహాగానాలు వినిపించాయి. ముఖ్యంగా మెగా బ్రదర్ నాగబాబు (కు కేబినెట్‌లో అవకాశం వస్తుందన్న ప్రచారం జరిగింది. ఆయన ఎమ్మెల్సీగా ఎన్నికై తొమ్మిది నెలలు గడిచినా మంత్రి పదవి దక్కకపోవడంతో, దీని వెనుక వ్యూహం ఉందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. 2026లో మంత్రివర్గ విస్తరణ జరిగే అవకాశం ఉందన్న మాట కూడా అప్పుడే మొదలైంది. 2024 జూన్ 12న కూటమి ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించడంతో, 2026 జూన్ నాటికి రెండేళ్ల పాలన పూర్తవుతుంది.సాధారణంగా ప్రభుత్వాలు రెండేళ్ల తర్వాత తమ పనితీరును సమీక్షించి మంత్రివర్గంలో మార్పులు చేస్తుంటాయి. చివరి ఏడాది పూర్తిగా ఎన్నికల మూడ్‌లోకి వెళ్లిపోతుందని, ఆ సమయంలో చేసిన మార్పులు ఆశించిన ఫలితాలు ఇవ్వవన్న అభిప్రాయం రాజకీయాల్లో ఉంది. అందుకే రెండేళ్ల సమయం కీలకమని భావిస్తారు. అదే లాజిక్ ప్రకారం, కూటమి ప్రభుత్వం కూడా రెండేళ్ల పాలనను బేరీజు వేసుకుని 2026లో పెద్ద ఎత్తున మార్పులు చేయవచ్చని చర్చ సాగుతోంది.ప్రస్తుతంకూటమికి 164 మంది ఎమ్మెల్యేలు ఉండగా, మంత్రివర్గంలో ఒకఖాళీ ఉంది. మార్పులు చేర్పులు చేస్తే మరో ఆరు లేదా ఏడు స్థానాలు అందుబాటులోకి రావచ్చని అంచనా. దీంతో కేబినెట్ బెర్తల కోసం తీవ్ర పోటీ ఉండడం ఖాయం. ప్రాంతీయ సమతుల్యత, రాజకీయ అవసరాలు, సామాజిక సమీకరణలు అన్నింటినీ దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు తీసుకుంటారనిఅంటున్నారు.అయితే ఎప్పుడు మార్పులు జరిగినా ఉత్తరాంధ్ర,గోదావరి జిల్లాలు,రాయలసీమ నుంచి ఒక్కొక్కరికి పదవి గండం తప్పదన్న రాజకీయ జోస్యాలు వినిపిస్తున్నాయి. వీరితో పాటు పనితీరు ఆశించిన స్థాయిలో లేని మరికొందరికి కూడా పదవులు కోల్పోయే అవకాశం ఉందని అంటున్నారు. అదే సమయంలో విస్తరణ జరిగితే విశాఖ జిల్లా , కొత్తగా ఏర్పడిన పోలవరం జిల్లా నుంచి ఒకరికి అవకాశం రావచ్చన్న అంచనాలు ఉన్నాయి. గోదావరి ప్రాంతంలో ఒక సీనియర్ బీసీ నేతకు, రాయలసీమలో ఒక బలమైన సామాజిక వర్గానికి ప్రాతినిధ్యం దక్కే అవకాశాన్ని కూడా కొట్టిపారేయలేమని విశ్లేషకులు చెబుతున్నారు. మొత్తానికి 2026 ఏడాది ఎవరి ఆశలను నెరవేర్చుతుందో, ఎవరి రాజకీయ భవిష్యత్తుకు మలుపు తిప్పుతుందో వేచి చూడాల్సిందే.

# సలహాదారులు ఎన్నాళ్లు..?

**విజయవాడ,తెలంగాణ దిశ :** అధికారం మారినా పద్ధతులు మారలేదు.. ప్రభుత్వాలు మారినా సలహాల సంస్కృతి పోలేదు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాజకీయ వర్గాల్లో, సచివాలయ పరిసరాల్లో వినిపిస్తున్న ప్రధాన చర్చ ఇది. గత వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వ హయాంలో సలహాదారుల వ్యవస్థపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తిన తెలుగుదేశం పార్టీ, నేడు అధికారంలోకి వచ్చాక అదే బాటలో పయనిస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తాజాగా కూటమి ప్రభుత్వం ముగ్గురు ప్రముఖులను సలహాదారులుగా నియమించడంతో ఈ చర్చ మరోసారి తెరపైకి వచ్చింది.రాష్ట్ర ప్రభుత్వం తాజాగా జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం.. ప్రముఖ కార్టూనిస్ట్ శ్రీధర్, ప్రకృతి వైద్య నిపుణులు డాక్టర్ మంతెన సత్యనారాయణరాజు, చుండూరి సీతారామాంజనేయ ప్రసాద్‌లను వివిధ విభాగాలకు సలహాదారులుగా నియమించింది.

వీరిలో శ్రీధర్, మంతెన సత్యనారాయణరాజు తమ తమ రంగాల్లో లబ్ధప్రతిష్టులే అయినప్పటికీ, ప్రభుత్వ పాలనలో వీరి పాత్ర ఎంతవరకు అవసరం అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.గత ఐదేళ్ల వైసీపీ పాలనలో సలహాదారుల నియామకం ఒక ప్రహసనంగా మారిందన్నది బహిరంగ రహస్యం. దాదాపు ప్రభుత్వంలోని ప్రతి శాఖకు, ఉప శాఖకు కూడా సలహాదారులను నియమించి, వారికి క్యాబినెట్ ర్యాంకులు, భారీ జీతభత్యాలు, వాహనాలు, సిబ్బందిని సమకూర్చడంపై అప్పట్లో ప్రతిపక్షంలో ఉన్న టీడీపీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. అది "సలహాదారుల ప్రభుత్వం" అని, ప్రభుత్వ ధనాన్ని వృధా చేస్తున్నారని నాడు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ సహా కూటమి నేతలంతా దుయ్యబట్టారు. "మేము అధికారంలోకి వస్తే ఈ సలహాదారుల వ్యవస్థను ప్రక్షాళన చేస్తాం" అని హామీ ఇచ్చారు.

కానీ, నేడు కూటమి ప్రభుత్వం కూడా విడతలవారీగా సలహాదారులను నియమించుకుంటూ వెళ్తుండటంతో, అప్పుడు తప్పు అయినది, ఇప్పుడు ఒప్పు ఎలా అవుతుంది? అని రాజకీయ విశ్లేషకులు ప్రశ్నిస్తున్నారు.ఈ సలహాదారుల నియామకాల్లో వినిపించే ప్రధానమైన, సాంకేతికమైన అభ్యంతరం.. బ్యూరోక్రసీకి సంబంధించింది.

అత్యంత కఠినమైన పరీక్షల్లో నెగ్గి, దశాబ్దాల తరబడి పాలనా అనుభవం ఉన్న ఐఏఎస్, ఐపీఎస్, గ్రూప్-1 అధికారులు ప్రభుత్వ యంత్రాంగంలో అందుబాటులో ఉన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నుంచి సెక్షన్ ఆఫీసర్ వరకూ వేల సంఖ్యలో ఉద్యోగులు ఉన్నారు. విధానపరమైన నిర్ణయాలు తీసుకోవడానికి, ప్రభుత్వానికి దిశానిర్దేశం చేయడానికి ఈ వ్యవస్థ సరిపోదా? అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది.

అనుభవజ్ఞులైన అధికారులు ఉండగా, బాహ్య వ్యక్తులను సలహాదారులుగా తీసుకురావడం వల్ల అధికారుల మనోధైర్యం దెబ్బతింటుందనే వాదన కూడా ఉంది. ఒకవేళ సలహాలు నిజంగా అవసరమైతే, ఆయా రంగాల నిపుణులతో తాత్కాలిక కమిటీలు వేయవచ్చు కానీ, పూర్తిస్థాయి పదవులు ఎందుకనేది మేధావుల ప్రశ్న.ఈ నియామకాల వెనుక రాజకీయ ఉపాధి కోణం ఉందన్న విమర్శలను కొట్టిపారేయలేం. ఎన్నికల్లో టిక్కెట్లు దక్కని నాయకులకు, పార్టీ కోసం కష్టపడిన సానుభూతిపరులకు, సోషల్ మీడియాలో మద్దతుగా నిలిచిన వారికి ఏదో ఒక హోదా కల్పించాలనే ఉద్దేశంతోనే ఈ పదవులు సృష్టిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. గత ప్రభుత్వం తమ పార్టీ వారిని ఎలాగైతే అకాడమీల చైర్మన్లుగా, సలహాదారులుగా నియమించిందో, ఇప్పుడు కూటమి ప్రభుత్వం కూడా తమ మద్దతుదారులను తృప్తి పరచడానికి ఈ మార్గాన్ని ఎంచుకున్నట్లు కనిపిస్తోంది. ఇది కేవలం రాజకీయ నిరుద్యోగులకు ఉపాధి కల్పించే పథకంలా మారిందన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

ఇప్పటికే రాష్ట్రం తీవ్ర ఆర్థిక లోటులో ఉందని, అప్పుల కుప్పగా మారిందని ప్రభుత్వ పెద్దలే శ్వేతపత్రాలు విడుదల చేశారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో.. సలహాదారుల జీతభత్యాలు, వారి కార్యాలయాల నిర్వహణ, వసతుల కల్పన ఖజానాపై అనవసరమైన భారాన్ని మోపుతాయి. ఒక్కో సలహాదారుడి నిర్వహణకు నెలకు లక్షల్లో ఖర్చు అవుతుంది. పొదుపు చర్యలు పాటించాల్సిన ప్రభుత్వమే ఇలా ఆర్భాటాలకు పోవడం ఎంతవరకు సమంజసం అనే చర్చ సామాన్యుల్లోనూ జరుగుతోంది.


ప్రజాస్వామ్యంలో ప్రభుత్వానికి నిపుణుల సలహాలు అవసరమే. కానీ అవి పాలనను మెరుగుపరిచేవిగా ఉండాలి తప్ప, రాజకీయ అవసరాలు తీర్చేవిగా ఉండకూడదు. కార్టూనిస్టులు, ప్రకృతి వైద్యులు సమాజానికి అవసరమే కానీ, వారి సేవలను ప్రభుత్వ పాలనా యంత్రాంగంలో ఎలా వినియోగించుకుంటారో, తద్వారా సామాన్యుడికి ఏం మేలు జరుగుతుందో ప్రభుత్వం స్పష్టత ఇవ్వాల్సిన అవసరం ఉంది. లేదంటే, గత ప్రభుత్వం చేసిన తప్పునే ఈ ప్రభుత్వం కూడా చేస్తోందన్న అపవాదును కూటమి సర్కార్ మూటగట్టుకోక తప్పదు.

# పేద ప్రజల దేవుడు మంత్రి శ్రీధర్ బాబు




**కమాన్ పూర్,తెలంగాణ దిశ:** పేద ప్రజల దేవుడు మంథని నియోజక వర్గ అభివృద్ధికి మారుపేరుగా తెలంగాణ రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అని జై మాస్టర్ వకీల్‌పల్లి గ్రామ ప్రజలు కొనియాడారు. వకీల్‌పల్లి గ్రామంలో వెలసిన అభయాంజనేయ స్వామి ఆలయానికి ధూప-దీప-నైవేద్య పథకాన్ని మంజూరు చేయించినందుకు గాను మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చిత్రపటానికి పాలాభిషేకంచేసి గ్రామ ప్రజలు, కాంగ్రెస్ పార్టీ నాయ కులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకు లు మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో సమగ్ర అభివృద్ధి సాధిస్తోందని తెలిపారు. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వకీల్‌పల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ అధ్యక్షుడుకుందారపు కొమురయ్య ఏఎంసి డైరెక్టర్ గుగులోత్ ప్రవీణ్ కుమార్ రామగిరి మండలఎన్ ఎస్ యు ఐ మోత్కూరి నవీన్ గౌడ మలోత్ చంద్రయ్య ఆడిచనిస్లత్తయ్య బానోత్ చందు సామల రవి ఆడి చర్ల రజి రేవెల్లి మీనా మహిళానాయకులు, గ్రామ పెద్దలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# లోకేశ్ కనకరాజ్‌తో సినిమా కన్‌ఫర్మ్?




అల్లు అర్జున్ కథానాయకుడిగా అట్లీ దర్శకత్వంలో ఓ సైన్స్ ఫిక్షన్ చిత్రం తెరకెక్కుతున్న విషయం తెలిసిందే. ఇప్పటికై యాభైశాతానికి పైగా చిత్రీకరణ పూర్తయినట్లు సమాచారం. ఈ ఏడాది దసరా బరిలో ఈ చిత్రాన్ని నిలిపేందుకు మేకర్స్ ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ సినిమా పూర్తయిన తర్వాత అల్లు అర్జున్ తదుపరి సినిమా ఏమిటన్నది ఆసక్తికరంగా మారింది. లోకేశ్ కనకరాజ్ దర్శకత్వంలో ఆయన ఓ సినిమా చేయబోతున్నారని వార్తలు వినిపించాయి. విశ్వసనీయ సమాచారం ప్రకారం అల్లు అర్జున్-లోకేష్ కనకరాజ్ ప్రాజెక్ట్ దాదాపుగా ఖరారైందని తెలుస్తున్నది. లోకేష్ కనకరాజ్ లొకేషన్ రెక్కీ నిర్వహించనున్నారని, అనంతరం హైదరాబా ద్‌లో సినిమా కోసం పూర్తిస్థాయి ఆఫీసును ప్రారంభిస్తారని అంటున్నా రు. అల్లు అర్జున్-అట్లీ మూవీ ఆగస్ట్ కల్లా చిత్రీకరణ పూర్తిచేసుకుంటుందని సమాచారం. దీని తర్వాత లోకేష్ కనకరాజ్ సినిమా సెట్స్‌లో బన్నీ జాయిన్ అవుతారని అంటున్నారు. గ్యాంగ్‌స్టర్, మాఫియా నేపథ్య డ్రామాలను తెరకెక్కించడంలో లోకేష్ కనకరాజ్ సిద్ధహస్తుడు. మరి బన్నీ సినిమా కోసం ఆయన ఎలాంటి కథను సిద్ధం చేశారన్నది ఆసక్తికరంగా మారింది. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్‌ను అగ్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ తెరకెక్కించనుందని సమాచారం.

# తినిపించడంలోనే ఆయనకు ఆనందం



ఈ మధ్యకాలంలో అటు ప్రత్యక్షంగానూ, ఇటు పరోక్షంగానూ చర్చల్లో నిలిచింది అందాలభామ నిధి అగర్వాల్. ఈ హడావిడిలోనే ఆమె కథానాయికగా నటించిన 'ది రాజాసాబ్' సినిమా కూడా విడుదల కానున్నది. ఈ సందర్భంగా ప్రమోషన్స్‌లో బిజీగా ఉన్న నిధి అగర్వాల్× హీరో ప్రభాస్ గురించి ఆసక్తికరంగా మాట్లాడింది. 'మితాహారం ఎవరికైనా అగ్ని పరీక్షే. ముఖ్యంగా మేమైతే ఇష్టమైన ఫుడ్‌ని ధైర్యంగా తినలేం. తిండిని తగ్గించుకుంటేనే ఇక్కడ ఎక్కువకాలం ఉండగలుగుతాం. కానీ 'ది రాజాసాబ్' సెట్‌లో మాత్రం నేను కంట్రోల్‌లో ఉండలేకపోయా. నేనేకాదు.. నా తోటి హీరోయిన్లు ఇద్దరూ కూడా. దానికి కారణం ప్రభాస్. ఆయన ఎదుటివారి డైట్ చెడగొట్టడంలో ముందుంటారు(నవ్వుతూ).

కానీ ఆయన మాత్రం సెట్‌లో ఫ్రూట్స్ మాత్రమే తింటారు. ప్రతిరోజు ప్రభాస్ ఇంటి నుంచి ఓ క్యారియర్ వస్తుంది. అందులో సుమారు పది రకాల ఐటమ్స్ ఉంటాయి. వాటి స్మెల్ చూశాక తినకుండా ఉ ండలేం. భోజనప్రియులు రెండు రకాలుంటారు. వారిలో తింటానికి ఇష్టపడేవారు కొందరైతే.. తినిపించడానికి ఇష్టపడేవారు కొందరు. ప్రభాస్ రెండో టైప్. ఆయన తినిపించి ఆనందపడుతుంటారు.' అని చెప్పుకొచ్చింది నిధి అగర్వాల్.


# విశ్వక్ సేన్ కొత్త మూవీ లెగసీ




టాలీవుడ్ యంగ్ అండ్ డైనమిక్ హీరో, మాస్ కా దాస్ విశ్వక్ సేన్ మరో విలక్షణమైన కథతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఆయన నటిస్తున్న తాజా చిత్రం 'లెగసీ'. ప్యూర్ పొలిటికల్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమా టీజర్‌ను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. పాలిటిక్స్ ఈజ్ పర్సనల్ అనే పవర్‌ఫుల్ ట్యాగ్‌లైన్‌తో వచ్చిన ఈ టీజర్ ప్రస్తుతం సోషల్ మీడియాలో సెన్సేషన్ క్రియేట్ చేస్తోంది. టీజర్ ప్రారంభం నుండి ముగింపు వరకు చాలా ఇంటెన్స్‌గా సాగింది. ముఖ్యంగా విశ్వక్ సేన్ చెప్పిన డైలాగులు పొలిటికల్ హీట్‌ను పెంచుతున్నాయి రాజకీయమంటే పులిమీద సవారీ లాంటిదంటారు.. ఆ పులి మీద నాయకుడు ఒక్కడే కూర్చోవాలా? ఆ కుటుంబం మొత్తం కూర్చోవాలా?దిస్ ఈజ్ యాన్ ఇంటర్నల్ వార్ ఫర్ రియల్ లెగసీ

ఈ డైలాగ్స్ చూస్తుంటే, అధికారం కోసం ఒకే కుటుంబంలో జరిగే అంతర్గత పోరు, వారసత్వ రాజకీయాల చుట్టూ ఈ కథ తిరుగుతుందని స్పష్టమవుతోంది. గతంలో ఎన్నడూ లేని విధంగా విశ్వక్ సేన్ ఈ సినిమాలో ఒక సీరియస్ పొలిటీషియన్ పాత్రలో కనిపిస్తుండటం విశేషం. ఈ చిత్రానికి సాయికిరణ్ రెడ్డి దైడా దర్శకత్వం వహిస్తున్నారు. భారీ తారాగణంతో రూపొందుతున్న ఈ సినిమాలో ఏక్తా రాథోడ్ హీరోయిన్‌గా నటిస్తుండగా.. రావు రమేశ్, సచిన్ ఖేద్కర్, మురళీ మోహన్, కేకే మేనన్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కలాహి మీడియా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై యశ్వంత్ దగ్గుమటి, సాయికిరణ్ రెడ్డి దైడా నిర్మిస్తున్నారు.

# సంయుక్త మీనన్ ..ది బ్లాక్ గోల్డ్



ది బ్లాక్ గోల్డ్' సినిమాతో ప్రేక్షకుల్ని పలకరించనుంది సంయుక్తా మేనన్. ఇది ఆమె చేస్తున్న తొలి నాయికా ప్రాధాన్య చిత్రం. యోగేశ్ కేఎంసీ తెరకెక్కిస్తున్నారు. రాజేశ్ దండా నిర్మిస్తున్నారు. మురళీ శర్మ, రావు రమేశ్, నాజర్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు.

ఈ సినిమా ఈ వేసవిలో తెలుగు, హిందీ, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో విడుదల కానుంది. ఈ విషయాన్ని కొత్త ఏడాది సందర్భంగా గురువారం ప్రకటించారు. ఈ మేరకు ఓ కొత్త పోస్టర్‌ను పంచుకున్నారు. 'ఊహించని మలుపులతో సాగే సరికొత్త కథతో.. అద్భుతమైన యాక్షన్ సన్నివేశాలతో ఈ సినిమా అందర్నీ అలరించేలా ఉండనుంది. సంయుక్త దీంట్లో శక్తిమంతమైన పోలీసు పాత్రలో కనిపించనుంది. ఇప్పటికే 75శాతం చిత్రీకరణ పూర్తయింది. మరో 15రోజుల చిత్రీకరణే మిగిలి ఉంది. నిర్మాణానంతర పనులు శరవేగంగా జరుగుతున్నాయి. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తాం' అని చిత్ర వర్గాలు తెలిపాయి. ఈ సినిమాకి సంగీతం: సామ్ సీఎస్, ఛాయాగ్రహణం: ఎ వసంత్.

# కొత్త సినిమా కోసం స్టైలిష్‌గా పవన్



కొన్నేళ్ల కిందటే ఖరారైన పవన్ కల్యాణ్ – సురేందర్ రెడ్డి కలయికలో సినిమాని పట్టాలెక్కించేందుకు రంగం సిద్ధమైంది. నిర్మాత రామ్ తాళ్లూరి కొత్త ఏడాది ప్రారంభం సందర్భంగా ఈ విషయాన్ని సామాజిక మాధ్యమాల వేదికగా వెల్లడించారు. ఇదివరకు ఒప్పుకున్న సినిమాల్ని ఒకొక్కటిగా పూర్తి చేసుకుంటూ వస్తున్నారు పవన్‌కల్యాణ్. ప్రస్తుతం ఆయన చేతిలో ఉన్న 'ఉస్తాద్ భగత్‌సింగ్' ఈ ఏడాది వేసవిలో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇక తదుపరి ఆయన చేయనున్నది... సురేందర్ రెడ్డి దర్శకత్వం వహించనున్న సినిమానే అని స్పష్టమైంది. తన కలల ప్రాజెక్ట్ ఇదని, పవన్‌కల్యాణ్ పేరు పెట్టిన తమ నిర్మాణ సంస్థ జైత్రరామ మూవీస్‌పై ఈ చిత్రం రూపొందుతుందని తెలిపారు రామ్ తాళ్లూరి. వక్కంతం వంశీ రచనలో ఈ చిత్రం రూపొందనుంది. ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనులు సాగుతున్నట్టు తెలుస్తోంది.కొత్త ఏడాదిని పురస్కరించుకుని 'ఉస్తాద్ భగత్‌సింగ్' కొత్త లుక్‌ని విడుదల చేసింది ఆ చిత్రబృందం. అందులో పవన్‌కల్యాణ్ ఒక చేత్తో టేప్ రికార్డర్, మరో చేత్తో గన్ పట్టుకుని స్టైలిష్‌గా కనిపిస్తున్నారు. హరీశ్‌శంకర్ దర్శకత్వంలో, మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై రూపొందుతున్న చిత్రమిది.

# టైగర్ ష్రాఫ్‌తో జతకట్టనున్న కృతిశెట్టి



అందాల తార కృతి శెట్టి.. బాలీవుడ్‌లోకి అడుగుపెట్టనుందా? అంటే అవుననే అంటున్నాయి సినీ వర్గాలు. హిందీ యాక్షన్ హీరో టైగర్ ష్రాఫ్‌తో దర్శకుడు మిలాప్ జవేరి ఓ చిత్రం కోసం చేతులు కలిపినట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. తాజాగా ఇందులో కథానాయికగా కృతి శెట్టిని ఎంపిక చేసిందట చిత్రబృందం. 'ప్రముఖ నిర్మాణ సంస్థ టీ-సిరీస్ దీన్ని భారీ బడ్జెట్‌తో రూపొందించాలని నిర్ణయించుకుంది. జనవరిలో ముంబయిలో చిత్రీకరణ ప్రారంభం కానున్న ఈ సినిమాలో టైగర్ సరసన నటించడానికి కృతి ఇప్పటికే గ్రీన్ సిగ్నల్ ఇచ్చేసింది. ఇదే ఆమెకు తొలి హిందీ చిత్రం కావడం విశేషం. యాక్షన్ థ్రిల్లర్‌గా తీర్చిదిద్దుతున్న ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది ద్వితీయార్ధంలో విడుదల చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. త్వరలో దీనిపై అధికారిక ప్రకటన వెలువడే అవకాశాలున్నాయ'ని కృతి సన్నిహిత వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం ఆమె నటించిన 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ', 'వా వాతియార్' విడుదలకు సిద్ధంగా ఉన్నాయి.

Published, printed and Owned by Merugu Chandra Mohan Printed at Sahaja publications, H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana.
Published from H.No. 3-455, Journalist Colony, Dammaiguda, Nagaram, Keesara, Medchal Malkajgiri District, Telangana. RNI. NO: TELTEL/2023/88215